RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 331 గురువారం 25 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

# ఇస్రో మరో ఘనత..

## బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహ ప్రయోగం గ్రాండ్ సక్సెస్




తిరుపతి, డిసెంబర్ 24: శ్రీహరి కోటలో LVM-3 M-6 రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించింది. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా 4G, 5G సేవలను బ్లూ బార్డ్ బ్లాక్-2 అందించనుంది. ఎల్‌వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగం.

**ఇస్రో చైర్మన్ స్పందన...** ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. బాహుబలి ప్రయోగం విజయవంతమైందన్నారు. ఎల్‌వీఎంప్రయోగాల్లో సంపూర్ణ విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతం చేశామన్నారు. అమెరికన్ కస్టమర్ కోసం ప్రయోగం చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ ప్రయోగాల్లో ఇది ఒకటన్నారు. 34 దేశాలకు ఇస్రో సేవలందిస్తోందని అన్నారు. గగన్‌యాన్ కోసం ఈ ప్రయోగం మరింత ఆత్మవిశ్వాసం కలిగిస్తోందని తెలిపారు. ఇస్రోపై అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయమన్నారు. వాణిజ్య ప్రయోగాలలో మరోసారి సత్తా చాటామని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం 52 రోజుల్లోనే సిద్ధం చేసి ప్రయోగం చేపట్టామని చెప్పారు. మన శాస్త్రవేత్తల సమిష్టి విజయం.. ఎల్‌వీఎం 3 - ఎం 6 రాకెట్ ప్రయోగం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రయోగ విజయం తమకు అత్యంత ధైర్యాన్ని కల్పించిందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాలలో ఈ ప్రయోగం మూడవ వాణిజ్య ప్రయోగమని వెల్లడించారు. ఎల్‌వీఎం రాకెట్లనే చంద్రయాన్ 4, 5కు ఉపయోగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మానవ రహిత ప్రయోగాలని చేపట్టబోతున్నామని ప్రకటించారు. వాణిజ్య ప్రయోగ ఒప్పందాలు పూర్తయిన వెంటనే వరస వాణిజ్య ప్రయోగాలని చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో నావిగేషన్ ప్రయోగాలు, అంతరిక్షంలో స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు.

**బాహుబలి రాకెట్ ప్రయోగం సక్సెస్.. మోదీ రియాక్షన్...** శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం ప్రయోగించిన బాహుబి రాకెట్ ఎల్‌వీఎం3- ఎం6 ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2 ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై దేశంలోని పలువురు ప్రముఖులు స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రాబబు నాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తమ ఎక్స్ ఖాతాల వేదికగా వేర్వేరుగా స్పందించారు. ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతదేశ యువత శక్తితో.. మన అంతరిక్ష రంగం మరింత అభివృద్ధి చెందుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ప్రభావవంతంగా మారుతోందని ఆయన ఆకాంక్షించారు. ఎల్‌వీఎమ్ 3 నమ్మకమైన హెవీ లిఫ్ట్ పనితీరును కనబరుస్తుందన్నారు. గగన్‌యాన్ వంటి భవిష్యత్ మిషన్ల కోసం బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు.

అలాగే వాణిజ్య ప్రయోగ సేవలను సైతం విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాల సామర్థ్యంతోపాటు స్వావలంబను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట నుంచి ఎల్‌వీఎమ్3- ఎమ్6ను బుధవారం ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఈ సందర్భంగా ఇస్రో బృందానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. యూఎస్ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్ 2 మోసుకెళ్లి.. అందుకు నిర్దేశించిన కక్ష్యలో ఈ ఉపగ్రహం ఉంచిందన్నారు. భారత్ నేలపై నుంచి ఇప్పటి వరకు అత్యంత బరువైన ఉప్రగ్రహాన్ని ప్రయోగించ లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాజాగా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా మన దేశ వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం, ప్రపంచ ప్రయోగ భాగస్వామిగా దాని స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ అద్భుతమైన మిషన్ విజయానికి దోహదపడిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఇలా ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. బాహుబలి రాకెట్ అని పిలువబడే ఎల్‌వీఎమ్3 - ఎమ్ రాకెట్‌ను శ్రీహరికోట నుంచి ఈ రోజు విజయవంతంగా ప్రయోగించినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లోని శాస్త్రవేత్తలు, సిబ్బందికి రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారతదేశ వాణిజ్య ప్రయోగ సామర్థ్యాలను ప్రపంచం ఎదుట ప్రదర్శించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించుకోవాలని కోరుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## ఒక్కో గ్రామానికి రూ.10 లక్షలు...

### కొత్త ఏడాదిలో గ్రామాలకు సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లులు



కోస్గి: నూతన సంవత్సరంలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ. 5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ. 10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో సంబంధం లేకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేస్తాన్నారు. ఎన్నికల సందరరేగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రామాల్లో సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామాల్లో దీరెకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఉపయోగించాలన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందరరేగా సీఎం మాట్లాడారు. "కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ప్రతి గ్రామం, తండాకు రోడ్లు పూర్తి చేస్తాం. గుడి, బడి, తాగునీరు, పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తాం. నిరుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తాం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు.. గ్రామాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సేవ చేయాలి. దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. పేదలకు పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన అందుబాటులోకి వస్తుంది. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టిన నాయకులను అభినందిస్తున్నా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి మా సోదరుడు తిరుపతిరెడ్డిని అందుబాటులో ఉంచా. ఎన్నికలు ముగిశాయి.. ఇక ఎలాంటి రాజకీయాలు లేవు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలు, పంథాలు ఉండాలి. రాష్ట్రానికి నాయకత్వ వహిస్తున్న మనం అందరినీ కలుపుకొని పోదాం. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదు" అని సీఎం అన్నారు.

## ఉద్యోగులకు భారీగా పెరగనున్న జీతాలు.. ఎంత పెరగొచ్చంటే



ఈ ఏడాది చివర్లో 7వ వేతన సంఘం గడువు ముగియనుంది. ప్రతి పదేళ్లకు ఓసారి కొత్త వేతన సంఘం ఏర్పాటు కావాల్సి ఉంటుందన్న సంగతి తెలిసిందే. దీంతో 2026లో 8వ వేతన సంఘం ఏర్పాటు కావాలి. కానీ ఇది కాస్తా ఆలస్యం అవుతోంది. ఎప్పుడో జనవరి నెలలోనే వేతన కమిషన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించినప్పటికీ.. విధివిధానాల ఆమోదానికి మరో 10 నెలల సమయం పట్టింది. ఇటీవలే నవంబర్ నెలలో 8వ వేతన కమిషన్ విధివిధానాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇక్కడ సిఫార్సుల కోసం 18 నెలల సమయం ఇచ్చింది. అంటే ఆ తర్వాతే 8వ వేతన సంఘం అమలయ్యే ఛాన్స్ ఉంది. దీంతో దాదాపు మరో రెండేళ్ల సమయం పట్టొచ్చని అంచనా వేస్తున్నారు. వేతన సంఘం ఎప్పుడు అమల్లోకి వచ్చినా.. ఉద్యోగులకు జీతభత్యాలు, పెన్షనర్లకు పింఛన్ పెరుగుతుందని చెప్పొచ్చు. ఆలస్యం కావడం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఒకవైపు ఆందోళనగా ఉన్నప్పటికీ.. మరోవైపు జీతాలు భారీగా పెరుగుతాయని సంతోషంలో ఉన్నారు.

ఇక్కడ వేతన కమిషన్ సిఫార్సుల్ని బట్టే ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అలవెన్సులు, డీఏ, పెన్షన్ వంటివి ఖరారవుతాయి. ఇక్కడ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కీలక పాత్ర పోషిస్తుంటుంది. ఇదే ఎంత మేర పెరుగుతుందనేది నిర్ణయిస్తుంది. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఎక్కువగా ఉంటే.. జీతం ఎక్కువగా పెరుగుతుంది. తక్కువగా ఉంటే.. జీతం తక్కువగా పెరుగుతుందని చెప్పొచ్చు. చాలా వరకు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2 కుపైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది 2.15 గా ఉంటే.. అప్పుడు ఉద్యోగుల జీతభత్యాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో తెలుసుకుందాం. ఇది ఆలస్యంగా అమల్లోకి వచ్చినా.. అరియర్స్ ఉంటాయి. ఉద్యోగి బేసిక్ పే రూ. 18 వేలుగా ఉందనుకుందాం. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2.15 గా అనుకుంటే కొత్త బేసిక్ పే రూ. 18000%ఇ2.15=% రూ. 38,500 అవుతుంది. అంటే ఇక్కడ రెట్టింపునకు మించి అయిందని చెప్పొచ్చు. ఇలాగే రూ. 50 వేల బేసిక్ పై కొత్త బేసిక్ పే రూ. 1,07,000 అవుతుంది.

మరిన్ని ఉదాహరణలు చూస్తే.. ప్రస్తుత లెవెల్-1 ఉద్యోగి ప్రస్తుత బేసిక్ పే రూ. 18 వేల నుంచి రూ. 38,700 కు పెరుగుతుంది. లెవెల్-2 ఉద్యోగి బేసిక్ పే ఇప్పుడు రూ. 19,900 గా ఉండగా.. 2.15 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ లెక్కన ఇప్పుడు రూ. 42,785 కు చేరుతుంది. లెవెల్-3 కింద రూ. 21,700 నుంచి రూ. 46,655 కు చేరుతుంది. లెవెల్-4 ఉద్యోగి కనీస వేతనం ఇప్పుడు రూ. 25,500 కాగా.. తర్వాత రూ. 54,825 కు చేరుతుంది. లెవెల్-5 కింద ఇప్పుడు రూ. 29,200 గా బేసిక్ పే ఉండగా.. తర్వాత రూ. 62,780 గా అవుతుంది. ఇలానే అన్నింటికీ వర్తిస్తుంది.





# నేను రాజకీయాల్లో ఉన్నంతకాలం..

# కేసీఆర్‌ని అధికారంలోకి రానివ్వను..

## ఇదేనా శపథం- సీఎం రేవంత్

కోస్గి : మాజీ సీఎం కేసీఆర్ టార్గెట్ గా నిప్పులు చెరిగారు సీఎం రేవంత్ రెడ్డి. ఓ రేంజ్ లో కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కేసీఆర్ తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి అంతే ఘాటుగా బదులిచ్చారు సీఎం రేవంత్. కొడంగల్ లో కొత్త సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్ మాట్లాడారు. కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం.. కేసీఆర్ ను అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం అని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. "అయ్య పేరు చెప్పుకుని బతికే నువ్వు.. గుంటూరు, గుడివాడలో చదువుకున్నావు.. నీకేం తెలుసు తెలంగాణ గురించి, మా పౌరుషం గురించి. నువ్వు కాదు మొత్తం నీ జాతినంతా తెచ్చుకో. ఎక్కడికి రావాలో చెప్పు. నువ్వు మా ఊరికన్నా రా, మేము నీ ఊరికన్నా వస్తాం. ఎవరు భయపడుతున్నారో సంగతి తేలుస్తా. గతంలో చెప్పా.. గజ్వేల్ కి వస్తా నీ నెత్తి మీద కాలు పెట్టి తొక్కుతా అని చెప్పా. ఇవాళ చెబుతున్నా మీడియా మిత్రులు రాసుకోండి.. 2029 ఎన్నికల్లో (ఒకవేళ 119 సీట్లే ఉంటే).. 80కి పైగా సీట్లతో మా ప్రభుత్వం ఏర్పాటవుతుంది. ఒక వేళ 150 సీట్లకు పెరిగితే 100కు పైగా సీట్లతో తెలంగాణలో గెలుస్తాం, రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెస్తాం. ఇది మా సవాల్. కేసీఆర్, కేటీఆర్, హరీశ్, దయాకర్ రావు, వినోద్, కృషారావు.. 2029లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తా, ఇది నా సవాల్ చేతనైతే కాసుకో. నీ రాజకీయం ఏంటో నేను చూస్తా. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డ మీద నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారం అనేది ఇక కల. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. ఎవడైనా చర్చించుకుంటే పొద్దుపోనప్పుడు మాట్లాడుకోవడానికి పనికొచ్చే చరిత్ర తప్ప.. భవిష్యత్తు తెలంగాణ రాష్ట్రానికి మీ వల్ల ఒరిగేది ఏమీ లేదు" అంటూ నిప్పులు చెరిగారు సీఎం రేవంత్ రెడ్డి.

**కేసీఆర్‌కు రేవంత్ ఓపెన్ ఛాలెంజ్.. తొలు తీసే పని నీకే ఇస్తా.!...** తనను , తన కుటుంబాన్ని గతంలో కేసీఆర్ వేధించారని, జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేసుకున్నారు. "నన్ను జైల్లో పెట్టి అణచివేయాలని చూశారు, కానీ నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఆయన నడుము విరిగి పడిపోయారు. ఆయన చేసిన పాపాలే ఆయనను వెంటాడుతున్నాయి. జైల్లో పెట్టి ప్రభుత్వ ఖర్చుతో ఆయనకు తిండి పెట్టడం ఎందుకని నేను ఒక్క కేసు కూడా పెట్టకుండా వదిలేశాను. కానీ ఇప్పుడు సోయి లేకుండా మాట్లాడుతూ తోలు తీస్తా అని స్థాయి లేని మాటలు మాట్లాడుతున్నారు" అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిసవాల్ విసురుతూ, "రా.. నీ చింతమడకకు రమ్మంటావా లేక కొడంగల్ వస్తావా? ఎక్కడైనా తేల్చుకుందాం. మటన్ కొట్టు మస్తాన్ దగ్గర పొట్టేలును కోసిన తర్వాత తోలు తీసే పని కేసీఆర్‌కు ఇమ్మని చెప్పాను. సాయంత్రం వెళ్లేటప్పుడు దావత్ కోసం ముక్కో బొక్కో ఇచ్చి పంపమని సూచించాను. నన్ను గెలికితే నేను మాట్లాడటం మొదలుపెడితే నువ్వు ఉరి వేసుకుని చస్తావు. నేను నీలాగా పాస్‌పోర్ట్ బ్రోకర్ దందాలు చేయలేదు, ఎవరిని దుబాయ్ పంపుతా అని మోసం చేయలేదు" అంటూ పాత విషయాలను ప్రస్తావించారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతానికి పైగా సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, తాను రాజకీయాల్లో ఉన్నంత కాలం కల్వకుంట్ల కుటుంబాన్ని అధికార పీఠం దరిదాపుల్లోకి కూడా రానివ్వనని భీష్మించుకున్నారు. కుటుంబ వ్యవహారాల పైన కూడా సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే భయంతో సొంత బిడ్డను, అల్లుడిని వెళ్లగొట్టాడని, సొంత చెల్లెలిని పండుగకు కూడా ఇంటికి పిలవలేని వ్యక్తి తన గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. "పిడకల మూతి బోడిలింగం లాంటి కేటీఆర్, నువ్వు, నీ జాతి అంతా వచ్చినా నేను భయపడను. మీ రాజకీయం ఏంటో చూపిస్తా, రాసి పెట్టుకో" అని సవాల్ విసిరారు. చివరగా సర్పంచ్‌లకు భరోసా ఇస్తూ, గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం మార్చి 31లోపు మూడు వేల కోట్ల రూపాయలను విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## సంపాదకీయం

### రష్యా పేరు చెప్పి భారత్ పై ఈ బాదుడు ఆలోచనలేంటి ట్రంప్?

రష్యా – ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఆపడం సంగతేమో కానీ.. ఈ గ్యాప్ లో ప్రపంచ దేశాలను, ప్రధానంగా భారత్ ను గట్టిగా బాదే ఆలోచనలు చేస్తున్నారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్! భారత్ తమకు మంచి మిత్రదేశం అని, భారతీయులంతా మంచివారని, ప్రధాని మోదీ తనకు మంచి మిత్రుడని చెబుతూనే చేయాల్సినదంతా చేస్తున్నారు. ఈ సమయంలో మరో భారీ బాంబు పేల్చారు! అవును... రష్యా – ఉక్రెయిన్ ల మధ్య యుద్ధం ఆపేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించకో.. లేక, ఆ పేరు చెప్పి తన పని తాను కానివ్వాలనో తెలియదు కానీ... పలు ప్రపంచ దేశాలను సుంకాలతో గట్టిగా బాదే పనికి పూనుకున్నారు ట్రంప్. ఇందులో భాగంగా... రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాల పెంపుకు సంబంధించిన బిల్లుకు తాను మద్దతిస్తున్నట్లు తాజాగా వెల్లడించారు. వాస్తవానికి రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై ఇప్పటికే పెద్ద మొత్తం లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరింతగా సుంకాల పెంపుకు సంబంధించిన బిల్లుకు తాను మద్దతిస్తున్నట్లు తాజాగా ఆయన వెల్లడించారు. మాస్కోతో వాణిజ్యం చేసే దేశాలపై మరిన్ని కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే బిగ్ బాంబ్ పేల్చారు. ఇందులో భాగంగా... రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500శాతం టారిఫ్ లు విధిస్తాన న్నారు. అయితే.. ఈ జాబితాలో కచ్చితంగా భారత్, చైనా ఉంటాయని చెబుతున్నారు! వీటితో పాటు ఇరాన్ కూ ఎఫెక్ట్ తప్పదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన బిల్లును రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఇటీవల ప్రతిపాదించారు. ఈ బిల్లులో... రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్ కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తున్నామని ట్రంప్ అన్నారు. ఇదే సమయంలో.. భారత్, చైనాలే రష్యా నుంచి సుమారు 70శాతం చమురును కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో.. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశం నుంచి పెద్ద మొత్తంలో ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

కాగా... భారతదేశంపై 50 శాతం సుంకా లు, రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లకు సంబంధించి ఇంకో 25 శాతం సుంకం సహా ప్రపంచంలోని పలు దేశాలపై కొన్ని అత్యంత తీవ్రమైన సుంకాలను ట్రంప్ పరిపాలన ఇప్పటికే విధించిన సంగతి తెలిసిందే! అవే బాదుడు అనుకుంటే.. ఇప్పుడు ఏకంగా 500% అని ట్రంప్ అంటుండటంతో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# నిబంధనలకు నీళ్లొదిలితే వడ్డించేస్తారు!



హైదరాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మించి భారీ మొత్తంలో తాగునీటిని వినియోగించకుంటున్న వారిపై జలమండలి కొరడా ఝులిపిస్తోంది. వారి నుంచి మూడింతల బిల్లులు వసూలు చేస్తోంది. జలమండలి పరిధిలో 14.6 లక్షల నీటి కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా 3 వేల వరకు అదనంగా చేరుతున్నాయి. కనెక్షన్లు పెరుగుతున్నా రాబడి పెరగకపోవడంపై జలమండలి దృష్టిసారించింది.

**ఏం జరుగుతుందంటే..** జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెండు, మూడు అంతస్తులకు అనుమతులు తీసుకుని నాలుగు లేదా ఐదు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్స్ పాటించకుండా ఆ స్థలాల్లోనూ నిర్మాణాలు చేస్తున్నారు. జలమండలి నీటి కనెక్షన్‌కు జీహెచ్ఎంసీ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తప్పనిసరి. అది ఉంటే జలమండలి సాధారణ నీటి ఛార్జీలనే వసూలు చేస్తుంది. చాలా చోట్ల నిర్మాణాల్లో అనుమతులను ఉల్లంఘించడం లేదా ఓసీ తీసుకున్న తర్వాత కొత్త నిర్మాణాలు చేయడం సాధారణంగా మారింది. దీంతో జలమండలి నీటికి డిమాండ్ పెరుగుతోంది.

మరోవైపు జలమండలి సిబ్బందితో లోపాయికారీ అవగాహనతో నీటిని ఎక్కువ పరిమాణంతో వినియోగించుకుంటున్నారు.

ఇలా చేస్తారు.. కొత్త నిర్మాణాలకు నీటి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉన్నా జలమండలి ప్రత్యేకంగా నిర్మాణాల కొలతలు తీసుకుని నిర్ధారించుకుంటుంది. పాత కనెక్షన్లు ఉన్నచోట అనుమతుల మేరకు భవన నిర్మాణాలు ఉన్నాయా? లేదంటే మార్పులు చేశారా? ఫ్లోర్‌లు పెరిగాయా? అని పరిశీలిస్తున్నారు. నిబంధనల ఉలంఘన ఉంటే సాధారణం కంటే మూడు రెట్లు నీటి ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

# ముక్కిపోయి.. పిండిగా మారి!



భగత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసిన నాటి నుంచి దొడ్డు బియ్యం గోదాంలలో ముక్కిపోతున్నాయి. పురుగు పట్టి బియ్యం పిండిగా మారిపోతున్నాయి. మరో వైపు నిల్వలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే సరకుకు పురుగు పట్టి, ప్రజాధనానికి నష్టం వాటిల్లుతోంది. గోదాంలలో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయి ఉండటంతో సన్నవి నిల్వ చేయడానికి స్థలంలేక ప్రతి నెలా పంపిణీలో ఆలస్యమవుతోంది.

**సన్నబియ్యం నిల్వకు కష్టం**

పౌరసరఫరా సంస్థ జిల్లాలో బియ్యం నిల్వలను మొదటి దశ బఫర్‌స్టాక్ పాయింట్, రెండో దశ మండల స్థాయి నిల్వల కేంద్రాలుగా నిర్వహిస్తోంది. మొదటి దశ కింద హుజూరాబాద్‌లో మూడు, జమ్మికుంట, రుక్మాపూర్‌లలో ఒకటి చొప్పున అయిదు గోదాంలున్నాయి. ఈ గోదాంలలో పౌరసరఫరా సంస్థ రేషన్ బియ్యం బఫర్ స్టాక్ కింద నిల్వ చేస్తుంది. దొడ్డు బియ్యం పంపిణీని నిలిపివేయడంతో అయిదు గోదాంలలో 4732.223 మెట్రిక్ టన్నుల నిల్వలు పేరుకుపోయాయి. సన్నవి నిల్వ చేయడానికి స్థలంలేకుండా పోయింది.

రెండో దశలో మిల్లుల నుంచి నేరుగా మండల స్థాయి నిల్వల కేంద్రానికి (ఎంఎల్ఎస్) రవాణా చేయాల్సి వస్తోంది. ఎంఎల్ఎస్ పాంట్లు కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంటలలో ఉన్నాయి. ఈ గోదాంలలో 5213.471 మె.ట దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. సన్నరకం బస్తాలను దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అధికారులు నేరుగా ప్రజా పంపిణీ దుకాణాలకు రవాణా చేస్తున్నారు. దీంతో రెండు నెలలుగా రవాణాలో జాప్యం జరగడంతో.. లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

మరో వైపు చౌకధరల దుకాణాల్లోనూ దొడ్డు బియ్యం నిల్వలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జిల్లాలో 566 దుకాణాల్లో 10–20 క్వింటాళ్ల వరకు దొడ్డువి ఉన్నట్లు సమాచారం.

వేలం వేస్తే మేలు..

ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు బియ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తుండటంతో పురుగుపట్టి ముక్కిపోయి.. పిండి రూపంలోకి మారుతున్నాయి. రూ.కోట్లాది విలువ చేసే ప్రజాధనం మురిగిపోతోంది. దొడ్డు బియ్యం వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో గోదాంల్లో సన్న రకాలకు చోటు లభించే అవకాశముంది.

**ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..**

గోదాంలో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలు ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. రజనీకాంత్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్

# 'మత్తు' వదిలిస్తున్నారు..!



నల్గొండ : ఎవరైనా జన్మించినా, చనిపోయినా, గెలిచినా, ఓడినా మందు ఉండాల్సిందే. ఇక వారాంతం వస్తే చాలు యువత, చిన్నా పెద్దా తేడాల్లేకుండా మద్యం లేనిదే జీవితం లేనట్లుగా బతికేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మత్తుతో చిత్తవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. చాపకింద నీరులా విస్తరిస్తున్న మద్యం, మత్తుల మహమ్మారిని 'డి–అడిక్షన్' కేంద్రాలు కొంత నియంత్రిస్తున్నాయి.

**ఏయే ప్రాంతాల్లో అంటే..**

కల్తీ మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు కల్లు కంపౌండ్లతో పాటు నల్గొండ, మిర్యాలగూడ, నకిరేకల్ ప్రాంతాల్లోనూ విరివిగా లభ్యమవుతున్నాయి. యాదాద్రి జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉన్న 20 కల్లు కేంద్రాల్లో నిత్యం వందలాది మంది యువత ఎక్కువ మత్తును కలిగించే కల్తీకల్లును తాగుతున్నారనే ఆరోపణలున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రం, తుంగతుర్తి, కోదాడ, మోత్కూరు ప్రాంతాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఒక ప్రభుత్వ కేంద్రం ఉన్నా.. విరివిగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**వచ్చే నష్టాలివి**

సరదాగా మొదలై అలవాటుగా మారిన వ్యసనాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఆల్కొహాలిక్స్‌గా మారిన వారికి సమాజంతో పాటు కుటుంబంలో గౌరవం ఉండదు.

కల్తీ కల్లు, గంజాయి తాగితే ఫిట్స్, నురగలు కక్కుతుండటం, వాంతులు, విరేచనాలు ప్రబలడం వంటి అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధన ప్రకారం. శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయి.

పరిస్థితులు విషమించిన 16 మంది 'మత్తు' బాధితులను హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించినట్లు నల్గొండ జిల్లాసుపత్రి వైద్యులు నగేశ్ తెలిపారు.

**పరివర్తన కలిగించేలా మెరుగైన సేవలు**

డా.సిహెచ్.శివ కుమార్, సైక్రియాటిస్ట్, జిల్లాసుపత్రి, నల్గొండ

మద్యం, మత్తు పదార్థాలకు వ్యసనపరులైన వారిని ఆల్కొహాలిక్స్ అంటాం. వీరికి ప్రతి 6 గంటలకొకసారి ఎలాగైనా..ఏం చేసైనా..మత్తు తీసుకోవాలనే ఆరాటం ఉంటుంది. సకాలంలో తీసుకోకపోతే కాళ్లు చేతులు వణకడం, అధిక రక్తపోటు, కోపం, డిప్రెషన్‌కు లోనవుతుంటారు. ఒక్కోసారి సైకోలా ప్రవర్తిస్తుంటారు. వీరి స్టేజీని బట్టి చికిత్స ఉంటుంది.

# దూరం భారమైంది!

కొత్తగూడెం : ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాలలో అసౌకర్యాలు తిష్ట వేశాయి. కనీస సదుపాయాలు కరవై వైద్య విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మన్యం జిల్లాగా పేరొందిన భద్రాద్రికొత్తగూడేనికి ప్రభుత్వ వైద్య కళాశాల రావటంతో పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయని భావించినా పరిస్థితి భిన్నంగా ఉంది. కాలేజీలో పూర్తి స్థాయి అధ్యాపకులు లేరు. విద్యాలయం, వసతి గృహాల నిర్మాణం పూర్తికాలేదు. పర్యవేక్షించే అధికారులు కరవయ్యారు. కొత్తగూడెం పట్టణంలో 2022–23 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించారు. కేఎంసీలోని ఒకే ఆవరణలో 40 ఎకరాల విస్తీర్ణంలో నర్సింగ్, ప్రధాన కళాశాల, క్యాంటీన్, వసతి గృహాల భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నర్సింగ్ కాలేజీ పూర్తి కావటంతో అందులో మెడికల్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లుగా మెడికల్ కాలేజీ నిర్మాణం కొలిక్కికాలేదు. నిధుల మంజూరులో జాప్యంతో గుత్తేదారులు మొండికేస్తున్నారు. అడపాదడపా పనులు చేపడుతున్నా పనుల్లో పురోగతి లేకుండా పోయింది. క్యాంపస్ వాతావరణం కన్పించేలా వసతి గృహాల పనులు ప్రారంభించారు. 70 శాతం వరకు పూర్తయినా మిగులు పనులు ఉండిపోయాయి. ఇప్పటికే మూడు విద్యా సంవత్సరాలు పూర్తయ్యాయి. నాలుగో ఏడాదికి సంబంధించి విద్యార్థులు చేరారు. మొత్తం 600 మంది విద్యార్థులున్నారు. వీరికి వసతి గృహ సదుపాయాలను పాల్వంచ పరిసర ప్రాంతాల్లోని అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. కిక్కిరిసిపోతూ ఉన్న గదుల్లోనే సర్దుబాటు చేసుకుంటున్నారు.



**ఇబ్బందులు ఇలా..**

1. హాస్టళ్లలో సదుపాయాల లేమితో విద్యార్థులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.
2. ఉదయం, రాత్రి తేడా లేకుండా వెళ్లాల్సి ఉండటంతో రాత్రివేళల్లో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.
3. విద్యార్థులు జిల్లా సర్వజనాసుపత్రి, రామవరం ఎంసీహెచ్ ఆసుపత్రుల్లో ప్రాక్టికల్, బోధన తరగతులు వినేందుకు వస్తున్నారు. ఇందుకోసం 12 కి.మీ. రాకపోకలు సాగించాల్సి వస్తోంది.
4. ఏకీకృతంగా హాస్టళ్లు లేకపోవటంతో కళాశాల బాధ్యుల పర్యవేక్షణ కొరవడింది. విద్యార్థినుల విషయంలో ఇదే పరిస్థితి.
5. పర్యవేక్షణ లేక కొన్నిసార్లు విద్యార్థులు గాడితప్పుతున్నారు. కొన్ని నెలల క్రితం ఆటో బోల్తాపడి వైద్య విద్యార్థులు గాయపడ్డ ఘటనలున్నాయి. ఇటీవల వైద్య విద్యార్థుల కారణంగా ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.
6. ఈ విషయమై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న మేర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# భూమి లేదు.. పట్టాలివ్వరు

సిరికొండ: నిజామాబాద్ గ్రామీణం నియోజకవర్గంలోని పేదలకు 2009లో అప్పటి ప్రభుత్వం ఎకరం చొప్పున భూమిని పంపిణీ చేసి పట్టాలిచ్చింది. కానీ, ఆ భూములు అటవీ పరిధిలోకి వస్తాయని ఆ శాఖ అధికారులు సాగును అడ్డగించడంతో సిరికొండ, ధర్పల్లి, ఇతర మండలాల లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. పలుమార్లు రెవెన్యూ, అటవీ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త సర్వేలు నిర్వహించినా సమస్య పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ పరిధిలోకే భూములొస్తాయని తేల్చినా అటవీ శాఖ భీష్మించుకుకూర్చుంటోంది. పలుచోట్ల సర్వే నిర్వహించాల్సి ఉంది.

**పథకాలకు దూరం..:** పలు గ్రామాల్లో పంపిణీ చేసిన భూముల్లో రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. డిజిటల్ సంతకాలతో నూతన పట్టా పాసుపుస్తకాలు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన పీఎం కిసాన్, రైతు భరోసా, బ్యాంకు రుణాలకు నోచుకోవడం లేదు.

ఈ చిత్రంలో కనిపిస్తోంది సిరికొండ శివారు 532 సర్వే నంబరులోని భూమి. ఇందులో 207 ఎకరాలు భూమి ఉంది. 2009లో అప్పటి ప్రభుత్వం 166 మంది లబ్ధిదారులకు ఎకరం చొప్పున కలెక్టర్ చేతుల మీదుగా పట్టాలు అందజేసింది. కానీ, భూమి తమదంటూ అటవీ శాఖ సాగు చేయకుండా అడ్డుకుంటోంది. రైతుల పక్షాన హైకోర్టు నిలిచినా.. న్యాయం కోరుతూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారు లేరు.

ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో పంటల సాగుకు ఏళ్లుగా పోరాడుతున్నాం. రెవెన్యూ భూమి అని తేలినా అటవీ శాఖ సాగుచేసుకోనివ్వడం లేదు. ప్రభుత్వం న్యాయం చేయాలి. జైరాబి, సిరికొండ

# రాముడి జాగాకు రక్షణ కవచం

భద్రాచలం : దేవాదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు మొదలయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకొని న్యాయ పోరాటం చేసేందుకు ఆ శాఖ సన్నద్ధమవుతోంది. ఇందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ నిర్ణయించారు. దీంతో భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం భూములపైనా దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ చర్చిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీల సహకారం తీసుకునే వీలుంది.

**భద్రాచలంలో కమిటీ**

రాములోరి భూములను భద్రంగా ఉంచేందుకు దాదాపు 2 నెలల కిందట అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. ఇందులో కలెక్టర్, దేవాదాయశాఖ అదనపు కమిషనర్, సబ్ కలెక్టర్, దేవాదాయ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు కీలక భూమిక పోషిస్తారు. భద్రాచలంలో ఒక దఫా ఈ బృందం సమీక్ష నిర్వహించింది. నిబంధనలకు విరుద్ధంగా దేవుడి మాన్యాన్ని కాజేస్తే తగు చర్యలు తీసుకునేందుకు ఈఓలకు అధికారం పెంచాల్సి ఉంది.

**ఏపీ పరిధే కీలకం**

రాములవారికి తెలంగాణ, ఏపీల్లో 1,340 ఎకరాల భూమి ఉంది. ఉమ్మడి ఖమ్మం, మెదక్, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాల్లో 1,100 ఎకరాల వరకు ఆక్రమణలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక్క పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోనే 889.5 ఎకరాలు ఉండగా వందల ఎకరాలు ఆక్రమణకు గురైంది. దశాబ్దాల ఈ సమస్యను ఇకనైనా సమన్వయంతో పరిష్కరించాలి. ప్రభుత్వం బృహత్ ప్రణాళికపై దృష్టి సారించడంతో రాములవారి స్థలంలో అభివృద్ధి పనులకు మార్గం ఏర్పడింది. ఆక్రమణలో ఉన్న అంగుళం జాగాను కూడా వదలం. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు మంచి పరిణామం. ఖాళీ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దామోదర్‌రావు, ఈఓ

## మాడవీధులు.. నిలిచిన పనులు

భద్రాచలం: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా శ్రీరామ నవమి సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే మాడవీధి నిర్వాసితులకు పరిహారాన్ని పంపిణీ చేశారు. కొద్ది కాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ క్రమంలో కొంతమంది ఇష్టపూర్వకంగా తమ ఇళ్లను తొలగించారు. ఇంకొంతమంది న్యాయ పోరాటం సాగించినా అధికారులు నచ్చచెప్పడంతో దేవుడి మీద భక్తితో తమ జాగాలను అప్పగించారు. ఇలా నాలుగు నెలల క్రితం 42 ఇళ్లను తొలగించి ఎకరానికి పైగా మాడవీధి స్థలాన్ని సేకరించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఖాళీ స్థలంలో ఇసుమంత అభివృద్ధి పని జరగలేదు. ఇళ్లను ఖాళీ చేయడంతో మాడవీధి బోసిపోయి కనిపిస్తోంది. మురుగు కాలువ వ్యవస్థ చిందరవందరగా మారింది. ఈ నెలాఖరును ముక్కోటి ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కనిపించేలా జాగ్రత్తలు పాటించాలి.

**ఉపాధి కోల్పోయారు..**

రామాలయ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక ద్వారా రూ.350 కోట్లను ప్రతిపాదించారు. ఈ నిధులు వచ్చిన తర్వాతనే అన్ని పనులకు మోక్షం వస్తుందని భావిస్తున్నారు. 42 ఇళ్లను తొలగించడంతో అందులోని దుకాణాల నిర్వాహకులు ఉపాధిని కోల్పోయారు. అభివృద్ధి పనులు



చేసే వరకైనా దుకాణాలను ఆ స్థలంలో ఏర్పాటు చేసుకుంటామని అడుగుతున్నారు. ఇళ్లను ఖాళీ చేసిన ప్రదేశంలో ఆక్రమణలకు చోటు చేసుకోకుండా కొంతమేర రక్షణ కంచె ఏర్పాటు చేశారు. పడమర మెట్ల వైపున మురుగు కాల్వ దెబ్బతింది. మట్టిదిబ్బలు పేరుకున్నాయి. అభివృద్ధి పనులు ఆలస్యమైతే మాడవీధి లక్ష్యం నీరుగారే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

**ఎందుకింత ఆలస్యం**

నిర్వాసితుల కాలనీ కోసం స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో స్థలాన్ని గుర్తించి చదును చేశారు. ఈ స్థలంలో రహదారులను నిర్మించాలి. విద్యుత్తు సదుపాయం కల్పించాలి. తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి. ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. తర్వాతనే అర్హులకు ప్లాట్లు చేసి అందించాలి. బృహత్తర ప్రణాళికతో సంబంధం లేకుండా మాడవీధుల విస్తరణ, నిర్వాసితుల పరిహారానికి రూ.60.20 కోట్లు అవసరం. ఇప్పటివరకు రూ.34.45 కోట్లు రావడంతో ఇళ్లను కోల్పోయిన వారికి పరిహారం అందించి కాలనీ స్థలాన్ని చదును చేశారు. మిగతా పనికి నిధులు కావాలి. శ్రీరామ నవమికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడకు వచ్చినప్పుడే మాడవీధుల విస్తరణకు శంకుస్థాపన ఉంటుందని భావించినా కుదరలేదు.

# పల్లెల్లో వీయాలి ప్రగతి వీచిక



పెద్దపల్లి : 'పల్లెల స్థాయిలోనే అన్ని వనరులు సమకూర్చుకోవాలి. గ్రామీణులు చైతన్యవంతులై అభివృద్ధికి కృషి చేయాలి' అన్న మహాత్మాగాంధీ ఆశయ సాధనలో పాలకవర్గాలు సమష్టిగా శ్రమిస్తేనే పల్లె ప్రగతి సాధ్యం కానుంది. రెండేళ్ల తర్వాత ఉమ్మడి జిల్లాలోని 1224 పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. పాలకవర్గాలు సొంత నిర?యాలు కాకుండా గ్రామస్థులను భాగస్వామ్యం చేస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని పై ఉదాహరణలు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు పల్లెలు అభివృద్ధిలో ముందుండటానికి ప్రధాన కారణం గ్రామస్థుల భాగస్వామ్యం. పరిసరాల పరిశుభ్రత, సంపూర? స్వఛతే, వనరుల సద్వినియోగం ఇలా సమష్టిగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తేనే అభివృద్ధి పరుగు తీయనుంది.

**యువత చేతిలో పల్లె భవిత**

గ్రామ పాలనలో యువత, స్వఛరేద సంస్థలు, మహిళలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. గ్రామానికి వచ్చిన ప్రతి పైసా ఖర్చు చేయడంలో పాలకులను ప్రశ్నిస్తేనే నిధుల ఖర్చులో పారదర్శకత పెరగనుంది. సర్పంచి, వార్డు సభ్యులు అధికారం దుర్వినియోగం చేయకుండా పర్యవేక్షించడం గ్రామస్థులు బాధ్యతగా భావించాలి.

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ జనాభా 2,467. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా సాగడం, అధికారుల ప్రోత్సాహంతో ప్రగతిలో ముందు నిలిచింది. 2023లో ఉత్తమ పంచాయతీ అవార్డు కింద రూ.50 లక్షల పురస్కారం పొందింది. ఆ డబ్బుతో గ్రామంలో మురుగు కాలువలు, సౌర విద్యుత్తు దీపాలు, ఇతర మౌలిక వసతులు సమకూర్చడంతో మరింత అభివృద్ధి సాధ్యమైంది.

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాలలో 5 వేల జనాభా ఉంది. గ్రామాభివృద్ధిలో ప్రజలు ఏకత చాటారు. ఊరిలో ఎటు చూసినా పచ్చదనం పరుచుకుంది. ప్రతి వాడలో సిమెంట్ రోడ్లు నిర్మించారు. శతశాతం అక్షరాస్యత, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడుల్లో బోధనతో 2021లో కేంద్ర ప్రభుత్వ పురస్కారం అందుకుంది.

ప్రణాళికతో సాగితేనే అభివృద్ధి

ప్రభుత్వ స్థలాల్లో పూలు, పండ్ల తోటల పెంపకం, సంత నిర్వహణతో ప్రజలకు మార్కెట్ సౌకర్యంతోపాటు ఆదాయం రెట్టింపు చేసుకోవచ్చు. గ్రామ కంఠం, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధితోపాటు పంచాయతీ ఆదాయం పెరగనుంది.

ఇంటి పన్ను, గ్రంథాలయ, రహదారి పన్ను, బందెల దొడ్డి వేలం ఇలా పది రకాల పన్నుల వసూళ్లతో ఆర్థికంగా బలోపేతం చేయొచ్చు. ప్రజా భాగస్వామ్యంతో నీతివంతమైన, మేలైన పాలన అందించవచ్చు. స్వఛతేపై ప్రత్యేక దృష్టి పెట్టి మురుగు కాలువలు, రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.

తడి, పొడి చెత్త సేకరణతో శుభ్రతతోపాటు ఆదాయం సమకూర్చుకోవచ్చు. ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా పర్యావరణ స్పృహ కలిగించొచ్చు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షిస్తే పచ్చదనం పరుచుకోనుంది. ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం అవసరం. పారిశుద్ధ్యంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయి.

## మూత్రపిండం.. ప్రాణ గండం

పెద్దపల్లి : ఆహార అలవాట్లలో మార్పులు, మధుమేహం, మద్యపానం, జన్యుపరమైన లోపాలమూలంగా మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. శరీరానికి కావాల్సిన మోతాదులో నీరు తీసుకోకపోవడం, ఇతర వ్యాధుల ప్రభావం, ఇష్టారీతిగా మందుల వాడకంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఫలితంగా జిల్లాలో వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

**కారణాలు ఇవి..**

మూత్రనాళం చిన్నదిగా ఉండటం.

ఎక్కువసేపు మూత్ర విసర్జన చేయకుండా ఆపుకోవడంతో ఇబ్బందులు.

చాలా మంది నీటిని చాలా తక్కువ పరిమాణంలో తాగుతుంటారు.

అధిక బరువు, శరీరంలో ఇన్‌ఫెక్షన్లు.

నెలకు వెయ్యికిపైగా అనుమానితులు

జిల్లా టీ డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో మూత్రపిండాలకు సంబంధించి నెలకు సగటున 1,106 పరీక్షలు చేయడంతో చాలా మందికి పాజిటివ్‌గా తేలడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా ఆసుపత్రి, గోదావరిఖని సార్వజనిత, మంథని ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి.



ఒక్కో కేంద్రంలో అయిదు బెడ్(మంచాలు) అందుబాటులో ఉండగా చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో 86 మంది రోగులకు రక్తశుద్ధి చేస్తున్నారు. కరీంనగర్, ఇతర పట్టణాల్లో ప్రైవేటుగా రెట్టింపు స్థాయిలో చికిత్స పొందుతున్నారు.

**ఇలా చేస్తే మేలు**

అలసట, బలహీనత ఇతర సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

ఎక్కువ నీరు తీసుకోవడం, మద్యపానం, ఇతర వ్యసనాలకు దూరం.

మధుమేహం, బీపీ ఉంటే తరచూ కిడ్నీ పరీక్షలు చేసుకోవాలి.

ఉప్పు తగ్గించాలి, సొంతంగా నొప్పి మాత్రలు వాడకూడదు.

**లక్షణాలుంటే సంప్రదించాలి**

తరచూ మాంసాహారం తీసుకోవడం. కాలుష్యం, మధుమేహం, రక్తపోటుతో కిడ్నీ సమస్యలు ఏర్పడుతున్నాయి. బయటి ఆహారాన్ని పూర్తిగా మానేయాలి. అధికంగా మంచి నీరు తాగాలి. వైద్యుల సలహాలు పాటించి పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఫిజీషియన్ ప్రభుత్వ ఆసుపత్రి, పెద్దపల్లి

## థీమ్ పార్కుకు తాళం

హైదరాబాద్ : జలమండలి ఆధ్వర్యంలో రూ. 4 కోట్లు వెచ్చించి నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన థీమ్ పార్కు మూతపడింది. నాలుగేళ్ల క్రితం దీన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. వాననీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు, ఇంకుడుగుంతల ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన కలిగించేలా.. సంబంధిత పార్కును జూబ్లీహిల్స్‌లో అందుబాటులోకి తెచ్చారు. ప్రధానంగా ఆసక్తి ఉన్న వివిధవర్గాల ప్రజలు, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు



దీన్ని సందర్శించే వారు. ఈ సందర్భంగా.. వాననీటి సంరక్షణ కోసం తీర్చిదిద్దిన వివిధ మోడళ్లను పరిశీలించేవారు. డిస్‌ప్లే గ్యాలరీ, యానిమేషన్ సెంటర్, తాగునీటిని శుద్ధి చేయడం, సీవేజ్ ట్రీట్‌మెంట్‌లపై త్రీడీ షోల ద్వారా అవగాహన కలిగించడంతో పాటు వాననీటి సంరక్షణకు సంబంధించిన వీడియోగేమ్స్‌నూ వారికి అందుబాటులో ఉంచారు. స్థానిక ఆడిటోరియంలో పలు అంశాలపై షార్ట్‌ఫిల్మ్‌లను సైతం ప్రదర్శించేవారు. ఇన్ని విశేషాలున్న ఈ థీమ్ పార్కు గేటుకు రెండేళ్లుగా తాళాలు వేసి ఉంచారు. దీంతో లోపల చేపట్టిన ఏర్పాట్లన్నీ క్రమంగా పాడైపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# జనం మెచ్చినవారే జనార్దనులు



ఖమ్మం : గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచి. పల్లె పోరులో హోరాహోరీగా తలపడి విజేతలుగా నిలిచిన వారు నేడు (సోమవారం) గ్రామ పాలక పీఠాన్ని అధిరోహించనున్నారు. వారితోపాటు ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో నూతన పాలకమండలి కొలువుదీరనుంది. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి గెలిచిన ప్రజాప్రతినిధులపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. గ్రామంలో తిష'వేసిన సమస్యల్ని దూరం చేసి, అభివృద్ధిని దగ్గర చేయాలని కోరుతున్నారు. అయిదేళ్ల పాలనలో అయిదు అంశాలను ఆకళింపు చేసుకుని ముందుకెళ్తే జనం మనసుల్లో నిలిచిపోతారు. జనం మెచ్చిన అలాంటివారే జనార్దనులుగా మిగిలిపోతారు.

**గ్రామాల్లో పండగ వాతావరణం**

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం సర్పంచుల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యాలయాలను రంగురంగుల కాగితాలు, పూలు, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. కొన్నిచోట్ల అరటి ఆకులు, మామిడి తోరణాలతో శోభ తెస్తున్నారు. కొందరు నూతన సర్పంచులు సామాజిక మాధ్యమాల్లో ఆహ్వాన పత్రాలు పంపుతున్నారు. 2023, ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటినుంచి సుమారు 22 నెలలపాటు కొనసాగిన ప్రత్యేక అధికారుల పాలన స్థానంలో ప్రజా పాలన ఏర్పాటు కానుంది.

**1. కలుపుగోలుతనం**

గెలుపోటములు ఎన్నికల వరకే. సర్పంచిగా నియమితులయ్యాక తన పరిధిలో ప్రజలందరికీ అతనే జవాబుదారి. పనుల విషయంలో, సమస్యల పరిష్కారంలో 'నీ, నా' అన్న భేదం తారతమ్యాలు చూపొద్దు. మాటల్లో, చేతల్లో వివక్షకు తావు లేకుండా నిష్పక్షపాతంగా ఉండాలి.

**2. ఆలకించే తత్వం**

నిత్యం స్థానికులు ఎంతోమంది కలుస్తుంటారు. తమ ప్రాంతంలో ఇబ్బందులు, తమ దృష్టికొచ్చిన గ్రామ సమస్యలు వివరిస్తుంటారు. కొందరైతే పరిష్కారాలూ చూపుతుంటారు. విసుగు, నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఓపిగ్గా వినాలి. చిత్తశుద్ధితో సమస్య పరిష్కారానికి ప్రయత్నించినా సఫలం కాకుంటే బాధితులు మీ ప్రయత్నాన్ని అర్థం చేసుకుంటారు.

**3. నిధులపై అవగాహన**

ధనం మూలం ఇదం జగత్. గతంతో పోలిస్తే పంచాయతీలకు నిధులు పెరిగాయి. స్వఛతే పోటీల్లో నెగ్గితే ప్రోత్సాహక నిధులూ అందుతున్నాయి. ప్రభుత్వాల నుంచి వచ్చే డబ్బులతోపాటు ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలి. ఆక్షేపణలను అధిగమించి ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు, క్వారీల రూపంలో ఆదాయాన్ని మెరుగుపరచుకోవాలి. ఈ ప్రయత్నంలో అధికారులతో సమన్వయం చేసుకోవాలి.

**4. భగీరథ ప్రయత్నాలు**

చదువుతో సంబంధం లేకుండా కొందరు పూర్వ సర్పంచులు అతి పెద్ద సమస్యలూ పరిష్కరించగలిగారు. ఇందుకోసం భగీరథ ప్రయత్నం చేయక తప్పదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఉన్నతాధికారులను ఒప్పించి, మెప్పించి పల్లెను పీడిస్తున్న దీర్ఘకాలిక సమస్యలు ఒకటి రెండు పరిష్కరించినా జనం మనసులో ఉండిపోవచ్చు.

**5. యువ గళం.. మహిళా బలం**

ప్రజా సేవపై ఆసక్తి ఉన్న యువకులను గుర్తించాలి. అన్ని కార్యక్రమాల్లో మహిళా సంఘాలను భాగస్థుల్ని చేస్తూ పోవాలి. యువజన సంఘాలు, ఎన్‌ఆర్‌ఐలు, విద్యావంతులు, సంపన్నులు, స్వఛరేద సంస్థల సహకారంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఊరుమ్మడిగా ముందుకెళ్తూ ప్రగతి పథంలో దూసుకెళ్లేలా నాయకత్వం వహించాలి.

## సంకల్పానికి.. ఆటంకం

ఆదిలాబాద్ : నవజాత శిశు మరణాలను గణనీయంగా తగ్గించటానికి కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి 'సంకల్ప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ఆధ్వర్యంలో రెండేళ్లుగా తగిన చర్యలు తీసుకుంటోంది. దీంతో 2023-24లో నవజాత శిశు మరణాల రేటు 24 నుంచి ప్రస్తుతం 17కి తగ్గింది. శిశు మరణాలను సింగిల్ డిజిట్‌కు తీసుకెళ్లాలనేది లక్ష్యం.. కానీ, అవసరమైన సిబ్బంది, పరికరాలు లేకపోవడం ఆటంకంగా మారింది. ఎస్ఎన్‌సీయూలో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవటంతో రిమ్స్ పిల్లల వార్డు నుంచి ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను, ఇద్దరు సీనియర్ రెసిడెంట్ వైద్యులకు ఎస్ఎన్‌సీయూలో విధులను కేటాయించారు. ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే పిల్లల వార్డులో చికిత్స అందించటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. వార్డులో 60 పడకలను గాను నిత్యం 70కి పైగా చిన్నారులు చికిత్స పొందుతుంటారు. 24 గంటల పాటు వార్డులో చిన్నారులకు వైద్య సేవలు అందించటంతో పనిభారం పెరిగి మెరుగైన వైద్యం అందించటం కష్టతరంగా మారిందంటున్నారు. ఎస్ఎన్‌సీయూలో ఎన్‌హెచ్ఎం స్టాఫ్‌నర్సులు 10 మంది, రిమ్స్ నుంచి ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కాన్పుల విభాగంలో ఐసీఎంఆర్ నుంచి నియమితులైన స్టాఫ్‌నర్సులు కేవలం అయిదుగురు మాత్రమే ఉన్నారు.

## ధనాగారం..!

నల్గొండ: అన్నదాతలు పండించే వరి ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు రంగాలకు ఉపాధి కల్పిస్తోంది. మిల్లర్లు, ఇటుక బట్టీ వ్యాపారులు, మద్యం తయారీ సంస్థలు, తవుడు నూనె సంస్థలు (రైస్‌బ్రాన్ ఆయిల్)తో పాటు చిరు వ్యాపారులకు కల్పతరువులా మారింది.

ఉమ్మడి జిల్లాలో 270 వరకు రైస్‌మిల్లర్లు ఉండగా.. అందులో వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మిల్లింగ్ అనంతరం వృథాగా పారవేసే ధాన్యం పొట్టు, ఉడకబట్టే క్రమంలో వెలువడే నూకలు ఇవన్నీ ఆర్థిక వనరులు కల్పిస్తున్నాయి. ఇటుకలు కాల్చేందుకు ఊక, మద్యం తయారీ సంస్థలకు నూకలు, బియ్యం రవాణాతో లారీలు నడిపించే వారికి ఉపాధి కలుగుతుంది. లోడింగ్, అన్‌లోడింగ్ వల్ల హమాలీ కార్మికులకు భరోసా ఉంటోంది.

రూపాంతరం చెందే క్రమం ఇలాబియ్యం మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల ముడి బియ్యాన్ని, బాయిల్డ్ మిల్లుల వారు 68 కిలోల మేర ఉడకబెట్టిన బియ్యాన్ని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సిఐ)కు అప్పగించాల్సి ఉంటుంది. వరిలో పొట్టుశాతం 25 శాతంగా ఉంటుంది. వరి బరువులో 25 శాతం పొట్టు బరువుగా అంచనా వేస్తారు. బాయిల్డ్ రైస్ విషయానికొస్తే ఒక కిలోలో దాదాపు 1.67 క్యూబిక్ మీటర్ల మేర ఆవిరి రూపంలో బరువు ఆక్రమిస్తుంది. ధాన్యాన్ని మరాడించే క్రమంలో పూర్తి బియ్యం గింజ పొడవులో 75 శాతం కంటే తక్కువగా గింజలుంటే నూకలుగా పరిగణిస్తారు. మిగిలిన 33 కిలోల మేర మిల్లర్లు పొట్టు, తవుడు, ఊక, ఆవిరి, నూకల రూపంలో భరించాల్సి ఉంటుంది.

## గౌరవెల్లి.. హుస్నాబాద్ కల్పవల్లి

హుస్నాబాద్: మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో శాశ్వత సాగునీటి ఇబ్బందులు తీర్చడానికే గౌరవెల్లి రిజర్వాయరు నిర్మించారు. నీటి సరఫరాకున్న అడ్డంకులను తొలగిస్తే లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా హుస్నాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత వాసులు సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారని గంపెడాశలు పెట్టుకున్నారు.

**కాలువల నిర్మాణానికి రూ.430 కోట్లు**

రెండున్నరేళ్ల క్రితం 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఎన్జీటీలో కేసు, భూ నిర్వాసితుల సమస్య కారణంగా రిజర్వాయరులోకి నీటి పంపింగ్ చేయడం లేదు. 8.25 టీఎంసీ సామర్థ్యం కల్గిన రిజర్వాయరులోకి నీటిని పంపింగ్ చేసి నిల్వ చేస్తే సుమారు లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలగడంతో పాటు భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి. రిజర్వాయరు నుంచి పంట పొలాలకు నీరిందించడానికి కాలువల నిర్మాణానికి రూ.430 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

**నియోజకవర్గాన్ని కరీంనగర్‌లో చేర్చుతారా?**

పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు ముక్కలు చేసిన హుస్నాబాద్ శాసనసభ నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో చేర్చుతామని హామీ ఇచ్చారు. దీనిపై వివిధ పక్షాల నాయకులు కూడా ఆందోళన చేస్తున్నాయి.

బహుజన ఉద్యమనేత సర్వాయిపాపన్నకోటను సందర్శించి ఆయన స్వగ్రామమైన ఖిలాషాపురంను కోటతో సహా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

గండిపల్లిపై హామీ ప్రస్తావించేనా..

## పొదుపును 'ఆర్పీ'సింది..!

నల్గొండ : నల్గొండ పురపాలిక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మహిళా సంఘాలకు అండగా ఉండాల్సిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ).. వారి పొదుపు డబ్బులు రూ.1.50 కోట్లు కాజేయడం కలకలం సృష్టించింది. 12 సంఘాల్లోనే రూ.కోటిన్నర ఆర్థిక మోసం జరిగిందంటే ఇలాంటి సంఘాలు ఇంకా రెండు వేలకు పైగా ఉన్నాయి.

**అసలేం జరిగిందంటే!** జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో 12 మహిళా సంఘాలు ఉండగా.. ఆర్పీగా లింగంపల్లి వాహిని పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆమెకు నెలకు రూ.6వేల గౌరవ వేతనం చెల్లిస్తోంది. ఒక్కో సంఘంలో గరిష్ఠంగా 10 మంది వరకు ఉన్నారు. ఏడాది క్రితం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రుణం ఇవ్వగా.. అందరూ సక్రమంగా కిస్తీలు కట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి వారికి రూ.కోటిన్నర రుణాలు వచ్చాయి. దీంతో ఆర్పీకి దుర్బుద్ధి పుట్టింది. సభ్యులందరి ఆధార్, బ్యాంకు ఖాతా నెంబర్, ఇతరత్రా ఆధారాల నకలు పత్రాలపై సంతకాలు తీసుకుని, ఫోర్జరీ చేసి భారీ మోసానికి తెరతీసింది. జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంకులో రూ.కోటిన్నరను తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకుంది. వ్యక్తిగత ఖాతా నుంచి రూ.100 డిపాజిట్ చేయాలన్నా, తీయాలన్నా సవాలక్ష సందేహాలతో ఉక్కిరిబిక్కిరి చేసే బ్యాంకు అధికారులు ఇంత తేలిగ్గా.. రూ.కోటిన్నరను ఎలా అలా ఆమె ఖాతాలోకి జమ చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది.

**వెలుగులోకి ఇలా..** 9 నెలలుగా 12 సంఘాలకు చెందిన రూ.కోటిన్నరకు కిస్తీలను ఆర్పీ వాహిని తన ఖాతా నుంచే చెల్లిస్తుంది. మూడు నెలల నుంచి చెల్లించడం మానివేసింది. దీంతో బ్యాంకు అధికారులు సంబంధిత గ్రూపు సభ్యుల ఇంటికి నోటీసులు పంపించడంతో వాహిని మోసం బయటపడింది. దీంతో సంఘాల సభ్యులు ఆందోళనకు దిగి పుర కమిషనర్‌కి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసన్‌తో మాట్లాడగా.. ఆర్పీ వాహినిపై ఆర్థిక మోసం కింద క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు.

# పబ్బుల్లో ఆగని మత్తు గబ్బు

హైదరాబాద్: నగరంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న పబ్బులపై కొరడా ఝుళిపించేందుకు మూడు కమిషనరేట్ల పోలీసులు సిద్ధమవుతున్నారు. కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో తెలంగాణ ఈగిల్, హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ విభాగాలు వాటిపై దృష్టిపెట్టాయి. గోవా, ముంబయి, బెంగళూరులో ఉండే నైజీరియన్లు నగరానికి డ్రగ్స్ పంపించనున్నట్లు పోలీసులకు సమాచారం అందుతోంది. డ్రగ్స్ విక్రయిస్తూ, వినియోగిస్తూ పట్టుబడ్డ నిందితులు, వారికి పరిచయం ఉన్న స్మగ్లర్లపై నిఘా పెడుతున్నారు. తనిఖీల కోసం హెచ్‌న్యూ డ్రగ్స్ పరీక్షల కిట్లను కొనుగోలు చేస్తోంది.

**యువతను ఆకర్షించేందుకు..**

వినోదం ముసుగులో యువతను ఆకర్షించేందుకు కొన్ని పబ్బులు డ్రగ్స్ సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. కేవలం డ్రగ్స్ తీసుకోవడానికే కొందరు పబ్బులకు వెళ్తున్నట్లు తెలుస్తుంది. కొందరు నైజీరియన్లు ఏజెంట్ల ద్వారా పబ్బుల దగ్గరే విక్రయిస్తున్నారు. ఈ ఏడాది మాల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ కేసు దర్యాప్తులో మూడు పబ్బుల పాత్ర బయటపడింది. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఈ పబ్బులకు నిందితులు తరచూ వెళ్లి డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో కొత్త ఏడాదిలో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక కిట్లు సిద్ధం చేశారు.

**పావులుగా డీజేలు..**




మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంలో డీజే(డిస్క్ జాకీ)లు పావులుగా మారుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడుతోంది. నగరంలో అధికారికంగా, అనధికారికంగా 100కుపైగా పబ్బులు ఉన్నాయి. వినియోగదారుల్ని ఆకర్షించేందుకు పబ్బుల నిర్వాహకులు వారాంతాల్లో ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించి.. గోవా, బెంగళూరు, ముంబయి, దిల్లీ నగరాల్లో ఉండే డీజేలను తీసుకొస్తారు. ఇక్కడి వారు ఇతర నగరాలకు వెళ్తారు. కొందరు సొంతంగా సంగీత ఈవెంట్లు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే వారికి డ్రగ్స్ సరఫరా ముఠాలు, నైజీరియన్లతో సంబంధాలు ఏర్పడుతున్నాయి. తొలుత ఆనందం కోసం డ్రగ్స్ తీసుకుంటున్నారు.

# ఇదేం చలిరా బాబు..!

హైదరాబాద్: నగరంలో చలి తీవ్రత కొనసాగుతోంది. రాత్రిపూట శివార్లు చలికి గజగజ వణుకుతున్నాయి. సాధారణం కంటే ఐదారు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. పటాన్‌చెరులో అత్యల్పంగా 7.2 డిగ్రీలు నమోదైంది. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 8.3, రాజేంద్రనగర్‌లో 9.0, మల్కాజిగిరిలో 9.1, అల్వాల్‌లో 10.3, చందానగర్‌లో 10.4, కుత్బుల్లాపూర్‌లో 10.7, గాజులరామారంలో 10.8, సికింద్రాబాద్‌లో 11.2 డిగ్రీల కనిష‘ ఉషో?గ్రతలు నమోదయ్యాయి.



**నేటి నుంచి తగ్గే సూచన** చలి తీవ్రత తగ్గే అవకాశం ఉందని తెలంగాణ ప్రణాళికాభివ ృద్ధి సొసైటీ(టీజీడీసీఎస్) తెలిపింది. రాగల మూడు రోజులు 10 నుంచి 12 డిగ్రీల మధ్య కనిష‘ ఉషో?గ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. సంగారెడ్డి జిల్లాలో అక్కడక్కడ శీతల గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.


**ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ**

ఇళ్లలో వెచ్చదనం కోసం హీటర్లను కొనుగోలు చేస్తున్నారు. వేడుకల్లో సైతం ఆరు బయట హీటర్ల ఏర్పాటు అనివార్యంగా ఏర్పడటంతో వీటి గిరాకీ గతంలో కంటే పెరిగింది. ఆదివారం అంగడిలో ఉన్ని దుస్తుల కొనుగోలు, ఇయర్ మఫ్స్‌కి గిరాకీ పెరిగింది. చర్మం పొడిబారుతుండటంతో వైద్యుల సూచనల మేరకు మాయిశ్చరైజర్లు కొంటున్నారు. వీటన్నింటిని ఆన్‌లైన్‌లోనూ పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు.

# భవిష్యనగరిలో యూజీ సాధ్యమేనా?

హైదరాబాద్: ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలనేది సర్కారు లక్ష్యం. ఫ్యూచర్‌సిటీ మాస్టర్ ప్లాన్‌లోనూ కొత్తగా వేసే విద్యుత్తు లైన్లు అన్నీ భూగర్భంలో వేయాలనేది ప్రణాళిక. ఇదివరకే ఉన్న లైన్లను సైతం యూజీలోకి మార్చాలని తొలుత భావించారు. మీర్‌ఖాన్‌పేటలో ట్రాన్స్‌కోకు చెందిన 400/220కేవీ విద్యుత్తు ఉపకేంద్రం ఉంది. గ్రిడ్ నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి ఇతర ఉపకేంద్రాలకు సైతం ఓవర్ హెడ్‌లైన్లు ఉన్నాయి. ఇది కాకుండా సమీపంలోనే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 765/400కేవీ భారీ ఉపకేంద్రం కూడా ఉంది. వీటికి సంబంధించిన హైటెన్షన్ తీగలు సైతం ఓవర్‌హెడ్‌లోనే ఉన్నాయి. వీటిని భూగర్భంలోకి మార్చాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుందని భావించి పాతవాటిని సైతం యూజీలోకి మార్చాలనే విషయంలో వెనక్కి తగ్గారని తెలిసింది.

# యువతలో ఐజీఏ నెఫ్రోపతి!



హైదరాబాద్: యువతలో ఐజీఏ నెఫ్రోపతి నిశ్శబ్దంగా దాడి చేస్తోంది. ప్రతి 100 మూత్ర పిండాల వైఫల్య కేసుల్లో 15 శాతం వరకు ఈ కేసులే ఉంటున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యుడి పరిశీలనలో వెల్లడైంది. నిమ్స్‌కు సైతం ఈ తరహా కేసులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం బాధితులు 30-40 వయస్సువారే కావడం ఆందోళన కల్గిస్తోంది. ఐజీఏ నెఫ్రోపతి అనేది ఒక ఆటో ఇమ్యూనిటీ స్థితి. వ్యాధి నిరోధక శక్తి శరీరంపై దాడి చేయడం వల్ల దీని బారిన పడుతుంటారు. ఫలితంగా శరీరంలోని ఏజీఏ యాంటీబాడీలు మూత్రపిండాల్లోని ఫిల్టర్ యూనిట్లలో పేరుకుపోయి వాపు, రక్తంలో మూత్రం, ప్రొటీన్ పోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఆధునిక చికిత్సలతో వ్యాధిని పూర్తిగా నియంత్రించొచ్చు.

**ప్రధాన లక్షణాలు**

మూత్రంలో ప్రొటీన్ పోతుంది. నురగా కన్పిస్తుంది.
బాగా పరిశీలిస్తే మూత్రంలో రక్త చారికలు ఉంటాయి.
కాళ్లు, చేతులు, ముఖంలో వాపు... అలసట వస్తుంది.
తరచూ మూత్ర విసర్జన, పొత్తి కడుపులో నొప్పి ఉంటుంది.

జాగ్రత్తలివీజి
రక్తపోటు, షుగర్ నియంత్రణలో పెట్టుకోవడం
ఉప్పు తగ్గించడం, రోజూ గంటపాటు వ్యాయామం
తగినన్ని నీళ్లు తాగడం
మూత్ర విసర్జనలో తేడా ఉంటే వైద్యులను సంప్రదించడం
కాళ్లు, చేతులు, ముఖం వాపు ఉంటే పరీక్షలు తప్పనిసరి.

అదే తొలి సంకేతంగా గుర్తించాలి

డాక్టర్ సీరపాణి గోపాలుని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు, అపోలో

ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు లేకపోవడం ప్రధాన సవాల్. సాధారణ మూత్ర పరీక్షల్లో రక్తం లేదా ప్రొటీన్ కనిపించడమే తొలి సంకేతంగా భావించాలి. ఆలస్యంగా వైద్య పరీక్షలు చేయించుకుంటే అప్పటికే కిడ్నీలకు శాశ్వత నష్టం కలిగే ప్రమాదం ఉంది. తాజాగా అందుబాటులోకి వచ్చిన అధునాతన ఔషధాలతో వ్యాధిని నియంత్రణలో పెట్టుకోవచ్చు. లేదంటే పూర్తిగా తగ్గించవచ్చు. అధిక ముప్పు ఉన్న రోగులకు సైతం మేలైన థెరపీలు అందుబాటులోకి వచ్చాయి. తరచూ కిడ్నీ, మూత్ర, రక్త పరీక్షలు చేయించుకోవడం వల్ల మూత్రపిండాల్లో సమస్యలు ఉంటే గుర్తించే వీలుంది.

# హద్దులు నిర్ధారించరు.. ఆక్రమణలు ఆగవు



హైదరాబాద్: ఏడాదిలో చెరువులకు హద్దులు నిర్ధారిస్తామని హైడ్రా ఏర్పాటైన కొత్తలో కమిషనర్ రంగనాథ్ ప్రకటన చేశారు. కొన్ని రోజులకు నవంబరు, 2025 నాటికి హద్దుల నిర్ధారణపై నోటిఫికేషన్ల జారీ మొదలవుతుందన్నారు. కానీ.. ఇప్పటి వరకు ఒక్క చెరువుకు కూడా హద్దుల నిర్ధారణ జరగలేదు. ఉపగ్రహ చిత్రాలు, సర్వే ఆఫ్ ఇండియా పటాలు, ఇతరత్రా రికార్డులన్నింటినీ వడపోసి తటాకాల హద్దులను గుర్తించాలన్న హైడ్రా నిర?యమే అందుకు శాపంగా మారింది. చెరువుల ఆక్రమణలకు అవకాశం ఇస్తోంది. హైడ్రా తలపెట్టిన అభివృద్ధి పనులకూ ఆటంకాలు తలెత్తుతున్నాయి.

**హద్దు లేకపోతే ఇవే సమస్యలు..**

మాదాపూర్‌లోని సున్నం చెరువుకు ఎఫ్‌టీఎల్ లేకపోవడంతో.. హైడ్రా తలపెట్టిన చెరువు అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయాయి. స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో. ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని కోర్టు హైడ్రాను ఆదేశించింది.

అంబర్‌పేట్‌లో సుందరీకరణ పూర్తి చేసుకున్న బతుకమ్మకుంట చెరువుపైనా న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. చెరువును సుందరీకరించినప్పటికీ.. రికార్డులు సరిగా లేకపోవడంతో కోర్టు ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారీ కసరత్తుతోనే జాప్యం?


ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలు, సర్వే ఆఫ్ ఇండియా పటాలు, గ్రామ పటాలన్నింటినీ క్రోడీకరించి. చెరువులకు హద్దులను నిర్ధారించాలని కమిషనర్ రంగనాథ్ నిర?యించారు. సర్వే ఆఫ్ ఇండియా పటాల్లో సహజంగా నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలు చెరువుల్లా కనిపిస్తున్నాయని, కొన్ని చెరువుల విస్తీర?ం రెట్టింపు నమోదైందని అధికారులు చెబుతున్నారు. దాంతో ఏకాభిప్రాయం రాక. హద్దుల నిర్ధారణలో జాప్యమవుతోంది.

హైడ్రా పరిధిలోని ప్రస్తుత చెరువులు: 600
అందులో హద్దుల నిర్ధారణ పూర్తయినవి: 51 (ఐదేళ్ల క్రితం)
ఆక్రమణకు గురైనవి: 225
పూర్తిగా కనుమరుగైనవి: 20

**2026 నాటికి పూర్తిచేస్తాం..** ఏ.వి.రంగనాథ్, కమిషనర్, హైడ్రా

రెవెన్యూ, నీటిపారుదలశాఖ, సర్వే విభాగాల అధికారులతో సమావేశాలు జరుగుతున్నాయి. నెలాఖరుకల్లా 50 చెరువులకు నోటిఫికేషన్లు ఇస్తాం. తర్వాత నెలకు 50 నుంచి 75 చెరువులకు ప్రకటనలిస్తాం. 2026 చివరికల్లా చెరువలన్నింటికీ హద్దుల నిర్ధారణ పూర్తవుతుంది.

# మన్యంలో విద్యా వెలుగులు



దుమ్ముగూడెం : కుల మతాలకు అతీతంగా నిరుపేద ప్రతిభ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందుకు తగ్గట్టు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రూ.కోట్లాది అంచనా వ్యయంతో దాదాపు 119 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా దుమ్ముగూడెం మండలం పెదనల్లబెల్లి-చినబండిరేవు గ్రామాల మధ్య పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

**రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం** పెదనల్లబెల్లి-చినబండిరేవు గ్రామాల మధ్య యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించడానికి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దాదాపు 35 ఎకరాల భూములను సేకరించారు. ఈ క్రమంలో 16 మంది రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసి తమ భూములను ప్రభుత్వం లాక్కుంటోందని హైకోర్టును ఆశ్రయించారు. చివరకు బాధిత రైతుల పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సుమారు రూ.250 కోట్లు పాఠశాల నిర్మాణానికి మంజూరు చేయడంతో పాటు దాదాపు 25 ఎకరాల మేరకు భూకేటాయింపునకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. **చురుగ్గా పనులు** పాఠశాల నిర్మాణ పనులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించడంతో ఓ ప్రైవేటు కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. యంత్రాల సాయంతో స్థలాన్ని చదును చేస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసే అవకాశం ఉంది. ఇది పూర్తయితే దాదాపు 5 వేల మంది అర్హులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం కలుగుతుంది. త్వరలోనే మంత్రుల చేతుల మీదుగా లాంఛనంగా భూమిపూజ, శంకుస్థాపన చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. పాఠశాల మంజూరు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలుమార్లు కలిసి విన్నవించానన్నారు. మన్యం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

# గుండె గుబిల్లు

హైదరాబాద్: నగరంలో చాలావరకు గృహ, వాణిజ్య భవనాలు పది మీటర్లు అంతకంటే ఎక్కువ ఎత్తులో నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక జీహెచ్‌ఎంసీ నుంచి నివాస యోగ్య ధ్రువీకరణ పత్రం(ఓసీ) సమర్పిస్తేనే విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేయాలని నిబంధనలు చెబుతున్నా.. ఇవేవి పట్టించుకోకుండా కొందరు విద్యుత్తు సిబ్బంది, అధికారులు ముడుపులు తీసుకుని కనెక్షన్లు ఇచ్చారు. మరికొందరు బిల్డర్లు నకిలీ ఓసీలు సమర్పించి, మూడు నెలల్లో ఓసీ సమర్పిస్తామని అండర్‌టేకింగ్ ఇచ్చి విద్యుత్తు కనెక్షన్లు పొందారు.



ఈ భవనాల్లో ఫ్లాట్లను కొనుగోలుదారులకు అమ్మేశారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా పొందిన విద్యుత్తు కనెక్షన్లు కావడంతో వాటికి గృహ, వాణిజ్య కనెక్షన్ కాకుండా తాత్కాలిక కనెక్షన్ కేటగిరీ-8 కిందకు మార్చి ఫ్లాట్ యాజమానులకు డిస్కం నోటీసులు ఇస్తోంది. ఈ విభాగం కింద యూనిట్‌కు రూ.12 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇది కొనుగోలుదారులపై తీవ్ర భారం పడుతుంది. ముడుపులు తీసుకున్న కొందరు అధికారులు, మరికొందరు బిల్డర్లు లాభపడి.. ఫ్లాట్లు కొన్నవారు మాత్రం అధిక బిల్లులతో ఇబ్బంది పడుతున్నారు.

**జారీ.. ఇక కఠినతరం**

అనుమతులు లేని భవనాలు, అక్రమ కనెక్షన్లపై కొంతకాలంగా డిస్కం దృష్టి పెట్టింది. కోర్టు ఆదేశాలతో కనెక్షన్ల జారీ ప్రక్రియను కఠినతరం చేసింది. ఓసీ లేకపోవడంతో గడిచిన మూడు నెలల్లో భారీగా కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ దశలోనైనా నిబంధనలకు విరుద్ధం ఉన్న కనెక్షన్లపై తొలగింపు కత్తి వేలాడుతుందని.. ముందే అన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అగ్నికి అధునాతన మాపకాలు

హైదరాబాద్: అగ్ని నివారణను బలోపేతం చేసే ఐవోటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సాంకేతికత అందుబాటులోకి వచ్చేసింది. పరిశ్రమలు, కార్పొరేట్ కార్యాలయాలు, కొన్ని నివాసాలకు పరిమితమైన ఈ సాంకేతికతను అంతటా ఉపయోగించడం ద్వారా అగ్నిమాపక వ్యవస్థను మరింత బలోపేతం చేయొచ్చు. భవనాల్లో పంపింగ్ వ్యవస్థ పనిచేయకపోయినా, ప్రెషర్ తగ్గినా మొబైల్‌కు సమాచారం చేసి అప్రమత్తం చేస్తుంది. తద్వారా ప్రమాదాల సమయంలో ఇబ్బందులు ఎదురు కావని, నగరంలో ఏర్పాటు చేసిన ఫెసా (ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ, ఆటోమేషన్ ఫర్ టాల్ బిల్డింగ్స్) సదస్సుకు హాజరైన నిపుణులు తెలిపారు.

**ఏటా 1500 ప్రమాదాలు..**

గ్రేటర్‌లో లక్షకుపైగా భవనాలు, 15 మీటర్లకు మించి ఎత్తైన భవనాలు



30 వేల వరకు ఉంటాయి. కొన్ని భవనాల్లో మాత్రమే నీటి సరఫరా, పంపింగ్ వ్యవస్థలను నిర్వహించేలా ఐవోటీ సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఏటా 1500కిపైగా ప్రమాదాలు సంభవించే మహానగరంలో ప్రతి అపార్ట్‌మెంట్‌లో వీటి అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**ట్యాంక్, పంప్ ఎప్పుడూ సిద్ధంగా..**

ఐవోటీ సెన్సర్లు ట్యాంక్‌లోని నీటి స్థాయిని 24 గంటలపాటు పర్యవేక్షిస్తాయి. నీరు 50-60% కంటే తక్కువైతే వాటంతట అవే మెయిన్ లేదా బోర్‌వెల్ నుంచి రీఫిల్ అవుతుంది.

ఫైర్ పంప్ డ్రై రన్ అయ్యే అవకాశం లేదు. మోటార్ బర్న్ అవుట్ రిస్క్ సున్నా.కొత్త వ్యవస్థల్లో వీఎఫ్‌డీ (వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్), ఐవోటీ ఉంటే ఫైర్ హైడ్రెంట్ తెరుచుకొని వెంటనే పంప్ వేగం దానంతటదే 100 శాతానికి వెళ్తుంది.పాత వ్యవస్థల్లో జాకీ పంప్ 10-15 సెకన్లలో పీడనం పెరిగితే, నూతన సాంకేతికతతో 3-5 సెకన్లలోనే మొదలవుతుంది.

# అటు నిప్పు.. ఇటు నీరు

మణుగూరు : థర్మల్, జల విద్యుదుత్పత్తి రంగంలో దూసుకెళుతున్న జెన్కో సంస్థ సింగరేణిని ఆదర్శంగా తీసుకుని పర్యావరణ హితమైన విద్యుదుత్పత్తి దిశగా అడుగులు వేస్తోంది. నీటిపై తేలియాడే ప్లాట్‌ఫాంలపై సౌర పలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుదుత్పత్తి చేయనుంది. మణుగూరు సమీపంలోని బీటీపీఎస్‌లోని రిజర్వాయర్ వేదికగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన డీపీఆర్ రూపొందిస్తున్నారు. దానికి అనుమతులు లభిస్తే పనులు పట్టాలెక్కుతాయి.

ఎక్కడ నిర్మాణం?బీటీపీఎస్ అవసరాల కోసం నిర్మాణ స్థలంలో ఓ రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. గోదావరి నుంచి నేరుగా ఇందులోకి నీరు చేరేలా పైపులు వేశారు. రిజర్వాయర్‌లో 6 లక్షల టన్నుల నీరు నిల్వ ఉంటుంది. ఒక్కసారి నింపితే వారంపాటు నిల్వ ఉంటుంది. రిజర్వాయర్ వైశాల్యాన్నిబట్టి 20 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌరవిద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో మెగావాట్‌కి రూ.4 కోట్లు ఖర్చవుతుందని అంచనా. అదేవిధంగా బీటీపీఎస్‌లోని భవనాలు, కార్యాలయాలపై సౌర పలకలను ఏర్పాటు చేసి రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో 5 మెగావాట్ల ఉత్పత్తి చేయాలని నిర?యించారు. మొత్తంగా 25 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తికి జెన్కో సుమారు రూ.100 కోట్లు ఖర్చవుతుందని సమాచారం. ఈ విద్యుత్తుని బీటీపీఎస్ అంతర్గత అవసరాలైన యంత్రాలు, లైట్లు, టౌన్‌షిప్, ఏసీల వాడకానికి వినియోగించనున్నారు.

ఫ్లోటింగ్ సౌర విద్యుత్తు: 20 మెగావాట్లు
రూఫ్ టాప్ సౌర విద్యుత్తు: 5 మెగావాట్లు
ఖర్చు: రూ.100 కోట్లు
రిజర్వాయర్ వైశాల్యం: 600 మీటర్ల పొడవు, 390 మీటర్ల వెడల్పు

‘బీటీపీఎస్‌లో త్వరలో సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటు కానుంది. అందుకు తగిన ప్రణాళికలు జరుగుతున్నాయి. ఫ్లోటింగ్ సౌర పలకల ఏర్పాటుకు రిజర్వాయర్ అనుకూలంగా ఉంది.’

బిచ్చన్న, సీఈ.

## ఆపేది అక్కడ... ఎక్కేది ఇక్కడే

కాచిగూడ: కాచిగూడ స్టేషన్లో రైళ్లను నిలపడానికి సరిపోను స్టేబుల్ లైన్లు లేకపోవడం పెద్ద సమస్యగా తయారైంది. ఈ కారణంగా ఇక్కడి నుంచి నడపాల్సిన అనేక రైళ్లను ఇతర స్టేషన్ల నుంచి నడుపుతున్నారు. ప్రయాణికులు మాత్రం సింహ భాగం కాచిగూడ స్టేషన్‌లోనే ఎక్కుతున్నారు. కొన్ని రైళ్లు ఇక్కడి నుంచే బయలుదేరుతున్నా ఇతర స్టేషన్లలో నిలిపి ఉంచుతున్నారు. రైలు బయలుదేరడానికి ముందు ఇక్కడికి తీసుకొస్తున్నారు. విలువైన సమయం, ఇంధనం వృథా అవుతోంది.

**పదుల్లో రైళ్లు:** రోజూ పదుల సంఖ్యలో ఇక్కడి నుంచి రైళ్లు బయలుదేరి వెళుతున్నాయి. గోవా, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పలు రైళ్లు కాచిగూడ మీదుగా ఉత్తరాది రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, యూపీ, దిల్లీకి రాకపోకలు సాగిస్తాయి.



నిత్యం నగరం, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకుంటారు.

ఇతర స్టేషన్లలో ఇలా.. కాచిగూడలో సరిపోను స్టేబుల్ లైన్లు లేకపోవడంతో రైళ్లు రాగానే మేడ్చల్, బొల్లారం, క్యావలెరి బ్యారక్స్, ఫలక్‌నుమా, ఉందానగర్, దూకల్, షాద్‌నగర్ తదితర స్టేషన్లకు తీసుకెళ్లి నిలుపుతున్నారు.

ప్లాట్‌ఫారాలు: 5
స్టేబుల్, ఫిట్ లైన్లు : 3 చొప్పున
రోజువారీ రైళ్లు: 100 కు పైగా
ప్రయాణికులు: 55 వేలు
వారంతాలు, సెలవుల్లో : 65 వేల వరకు

## తాళ్లతో కట్టి.. కత్తితో బెదిరించి..!

హైదరాబాద్ :గాజుల వ్యాపారిని కత్తితో బెదిరించి నగదు కాజేసిన ఘటన ఆదివారం పాతబస్తీలోని భవానీనగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన మహ్మద్ సుల్తాన్(34), భార్య పర్వీన్‌బేగం(28) జీవనోపాధికి ఆరేళ్ల క్రితం నగరానికి వచ్చారు. తలాబ్‌కట్ట సల్మామజీదు సమీపంలోని అమాన్‌నగర్‌లో ఉంటున్నారు. చాచానగర్ గ్యారేజీ వద్ద రాళ్ల గాజులు తయారు చేసే ముడిసరకు విక్రయించే దుకాణాన్ని నడుపుతున్నారు. ఇటీవల బిహార్‌లో భార్యాభర్తల పేరిట ఉన్న భూములను అమ్ముకొని వచ్చిన సొమ్మును ఇంట్లో భద్రపరిచారు. గర్భిణి అయిన పర్వీన్‌బేగం రెండు నెలల క్రితం సొంతూరికి వెళ్లడంతో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు.



ఆదివారం తెల్లవారుజామున మాస్కులు ధరించిన దుండగులు సుల్తాన్ తలుపులు కొట్టారు. చెత్తను తీసుకెళ్లే వారు అనుకుని తీయగా.. వెంటనే ఇంట్లోకి చొరబడిన దుండగులు అతడిని తాళ్లతో బంధించారు. కత్తితో బెదిరించి రూ.40లక్షలు, చరవాణి, బైక్ తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న దక్షిణ మండలం డీసీపీ కిరణ్ ఖరే ప్రభాకర్, మీర్‌చౌక్ ఏసీపీ శ్యామ్ సుందర్, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, డీఐ నర్సింహ నాయక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిసర ప్రాంతాల సీసీ కెమెరాలను పరిశీలించారు. ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు.

## పాత వాహనం కొంటున్నారా..!

చౌటుప్పల్ : బైకు, కారు ఈ రోజుల్లో ప్రతి కుటుంబానికి తప్పనిసరిగ్గా మారింది. కొత్తది కొనే స్థాయిలో డబ్బు లేక చాలామంది తమ బడ్జెట్‌కు అనుగుణంగా సెకండ్ హ్యాండ్‌లో వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు కొత్త మోడళ్లు రాగానే పాతవాటిని పక్కన పెట్టేస్తుండటంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోళ్ల వ్యాపారం వృద్ధి చెందింది. మరి వీటిని కొనేముం దు కొన్ని సూచనలు పాటిస్తే పాత బండిని కొత్తగా పరుగులు తీయించొచ్చు. వెచ్చించిన సొమ్ముకు తగ్గ నాణ్యమైన వాహనాన్ని ఎంచుకోవచ్చని ఆటోమొబైల్ రంగ నిపుణులు సూచిస్తున్నారు. అప్రమత్తంగా లేకపోతే నిలువునా మోసపోయే



ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. మరీ వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో ఒకసారి చూద్దాం.పాత వాహనం ఏ సంవత్సరంలో తయారై మార్కెట్‌లోకి వచ్చిందో గమనించాలి. మన మెకానిక్‌ను తీసుకెళ్లి గుండెకాయలాంటి ఇంజిన్ నాణ్యతను పరిశీలించాలి. వాహనంలోని కీలక విడిభాగాల ప్రస్తుత పనితీరును, వాటి మన్నిక ఎంత కాలం ఉండొచ్చో చూడాలి. లీటర్ పెట్రోల్‌కు ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించగలదో తెలుసుకోవాలి. లైట్ల పని తీరును రాత్రి వేళ గమనించాలి. దీంతో పాత వాహనం కొన్న తర్వాత తక్కువ మరమ్మతు ఖర్చులతో సరిపెట్టొచ్చు.

పాత వాహనాలు కొనుగోలు చేసే సమయంలో దాని పత్రాలు సరిగా ఉన్నాయో లేదా పరిశీలించాలి. వాటిలో ఉన్న వివరాలతో ఇంజిన్, ఛాసిస్ సంఖ్య సరిచూసుకోవాలి. చోరీ చేసిన వాహనమైతే దాని ఛాసిస్ సంఖ్యను చెరిపేసి అమ్మజూపుతారు. ఆర్టీఏ అధికారులను సంప్రదించి ఆ వాహన యజమాని పేరును నిర్ధారించుకోవాలి. వాహనంపై ఏమైనా కేసులున్నాయా, చోరీ చేసినదా అని సమీప ఠాణాలో విచారణ చేయాలి. వాహనం కొనుగోలు చేయగానే మన పేరుపై వెంటనే మార్చుకోవాలి.

# ఇంధన రహితం.. కేంద్రం అభిమతం




భగత్‌నగర్ : జిల్లా ఎలక్ట్రికల్ ఛార్జింగ్ స్టేషన్లకు అడ్డా కాబోతోంది. కేంద్ర ప్రభుత్వం శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ పునరుత్పాదక వనరుల వినియోగాన్ని పెంచడానికి ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. మరో వైపు కాలుష్యాన్ని తగ్గించాలని చూస్తోంది. దీనిలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలు(ఈవీ)లకు ఆర్థికంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నా.. వినియోగం మాత్రం అనుకున్న స్థాయిలో లేదు. అందుబాటులో ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ ఇబ్బందులను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 150 స్టేషన్లు మంజూరు చేసింది.

**నూరు శాతం రాయితీ..**

జిల్లావ్యాప్తంగా 14 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లే ఉన్నాయి. ప్రయాణం మధ్యలో ఛార్జింగ్ తగ్గితే తిరిగి పెట్టుకోవడానికి అందుబాటులో కేంద్రాలు లేకపోవడంతోనే వీటి కొనుగోళ్లలో పురోగతి లేదు. ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే స్థలాలను ఏ, బీ, సీ, డీ నాలుగు విభాగాలుగా గుర్తించి రాయితీలు ప్రకటించింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థలాలను 'ఏ' కేటగిరీగా గుర్తించింది. దీని కింద ఏర్పాటు చేసే వాటికి కేంద్రం నూరు శాతం మౌలిక సదుపాయాలకు నిధులు ఇస్తుంది. ఎలక్ట్రిక్ వెహికిల్ సప్లయ్ ఎక్విప్‌మెంట్ (ఈవీఎస్‌ఈ)కు అయ్యే ఖర్చు నిధులు అందజేస్తుంది. ఏ, బీ కేటగిరీలో లేని ప్రాంతాలు షాపింగ్ మాల్‌లు, మార్కెట్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటు చేసే వాటికి మౌలిక సౌకర్యాలకు మాత్రం 80 శాతం రాయితీ ఇవ్వనుంది


బ్యాటరీ మార్చే కేంద్రాలను 'సీ' కేటగిరీగా గుర్తించారు. మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు 80 శాతం రాయితీ కింద కేంద్రం నిధులు ఇస్తుంది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ల ఆధీనంలో లేదా నిర్వహణలో ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాలను 'బీ' కేటగిరీగా గుర్తించింది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రమాలు, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల విక్రయ కేంద్రాలు, బస్‌స్టేషన్లు, నగర, పురపాలక పార్కుల్లో ఏర్పాటు చేసేవాటికి మౌలిక సౌకర్యాల ఏర్పాటుకయ్యే ఖర్చులో 80 శాతం, ఈవీఎస్‌ఈకి అయ్యే ఖర్చుకు 70 శాతం నిధులను కేంద్రం ఇస్తుంది. మిగతా నిధులు సంబంధిత శాఖ పెట్టాల్సి ఉంటుంది.

**జిల్లాలో 48 ప్రాంతాల గుర్తింపు**

విద్యుత్తు అధికారులు జిల్లా కేంద్రంతోపాటు హైవేలలో ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల స్థలాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి 48 ప్రాంతాలను గుర్తించాం. ఇందులో 24 ప్రభుత్వ స్థలాలు, 12 ప్రభుత్వ రంగ సంస్థల స్థలాలు ఉన్నాయి. బ్యాటరీ మార్చుకునే స్థలాలను ఇంకా గుర్తించలేదు.మేక రమేశ్‌బాబు, ఎస్‌ఈ, విద్యుత్తు శాఖ

# పేదల స్థలం.. పెద్దల పరం



హైదరాబాద్ : "శంషాబాద్ మండలం గొల్లపల్లిలో 18 ఎకరాల ఎసైన్డ్ భూములున్నాయి.విమానాశ్రయం సమీపంలో ఉండడంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. ప్రభుత్వం భూములను వెనక్కి తీసుకుంటుందంటూ ఎసైనీలను బెదిరించి వారి భూముల్లో కొన్నింటిని ఆర్నెళ్ల క్రితం తీసుకున్నారు. వీటిని తమ పేర్లతో మార్చుకునేందుకు ప్రైవేటు పట్టా ఉందంటూ రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటి ద్వారా ఇంటి నంబర్లు సృష్టించారు. వారి స్వాధీనంలోని భూముల విలువ రూ.300 కోట్లు"

-ప్రభుత్వ భూములను కొట్టేసేందుకు కొందరు అక్రమార్కులు చేస్తున్న మాయాజాలమిది. నిజాం కాలం నాటి దస్త్రాలంటూ నకిలీ పత్రాలు తీసుకొచ్చి సేత్వారు రికార్డుల్లో ఉన్నాయంటూ రెవెన్యూ అధికారులను నమ్మిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇలా ఇప్పటివరకూ రూ.900 కోట్ల విలువైన భూములను సొంతం చేసుకున్నారు. వాటికి ఈ-పాస్‌పుస్తకాలు తీసుకున్నారు.

ఎసైన్డ్, మిగులు భూముల వివరాలు సేకరించి.. కబ్జాకు పాల్పడుతున్న అక్రమార్కులు నిషేధిత భూములపైనే గురిపెడుతున్నారు. ఎసైన్డ్ భూములు, మిగులు భూముల వివరాలను సేకరించి వాటి కబ్జాకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. నిజాం కాలం నాటి పత్రాలను సృష్టించి వాటితో కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఆయా పత్రాలను పరిశీలించండి అంటూ న్యాయస్థానాలు ఉత్తర్వులు జారీ చేయగానే నకిలీ పత్రాలు, కోర్టు ఉత్తర్వులతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తున్నారు. ముడుపులు సమర్పించి ఈ-పాస్ పుస్తకాలు వచ్చేలా చేసుకుంటున్నారు.

**తెరవెనక స్థిరాస్తి వెంచర్ల ప్రతినిధులు**

శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములున్నాయి. వాటిని సొంతం చేసుకునేందుకు రూ.లక్షల్లో నగదు ఇస్తామంటూ కొందరు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఈ తతంగం తెరవెనుక రియల్ వెంచర్ల ప్రతినిధులుంటున్నారు. "ఎసైన్డ్ భూముల ఆక్రమణల అంశం తమ దృష్టికి వచ్చిందని, రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి తెలిపారు."

## నివాస ప్రాంతాల్లో మద్యం.. అధికారుల చోద్యం




హైదరాబాద్ :ఈ చిత్రంలో కనిపిస్తున్న మద్యం దుకాణం.. ఎల్బీనగర్- నాగోల్ మార్గంలో ఉంది. ఇన్నర్‌రింగురోడ్డుకు అనుకునిఉన్న ఈదుకాణం వద్ద సాయంత్రం రోడ్డుమీది వరకూ వాహనాలు పార్కింగ్ చేస్తారు. చీకటిపడితే పర్మిట్‌రూముకు వెలుపల దుకాణం బయట మద్యం తాగుతూ కనిపిస్తారు. పక్కనే బస్టాపు ఉండటంతో మందుబాబుల హంగామా కారణంగా మహిళలు బస్సు కోసం ఎదురు చూడాలన్నా ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం దాటితే ఆ ప్రాంతాల నుంచి వెళ్లాలంటే మహిళలు, చిన్నారులు ఆలోచించాల్సిందే.. ఎప్పుడు గొడవ జరుగుతుందో.. ఎటువైపు నుంచి ఎవరొచ్చి దాడి చేస్తారోనని తెలియక స్థానికుల ఆందోళన.. చీకటిపడితే ఎక్కడపడితే అక్కడ మద్యం తాగుతూ అలజడి సృష్టించే పోకిరీలు.. పొరపాటున ప్రశ్నిస్తే దాడులు.. ఇదీ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద నిత్యం కనిపించే పరిస్థితులు. రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో నివాస ప్రాంతాలకు సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలు తొలగించాలంటూ స్థానికులు ఆందోళనకు దిగుతున్నారు. షాప్‌లను ఇతర ప్రాంతాలకు మార్చాలని ఏళ్ల తరబడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తున్నా పరిస్థితిలో మార్పు లేదు. డిసెంబరు 1 నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ ప్రారంభమవుతోంది. లైసెన్సులు దక్కించుకున్న దుకాణదారులు నుంచి విక్రయాలు ప్రారంభిస్తున్నారు. కొత్త మద్యంపాలసీలో భాగంగానైనా దుకాణాలను నివాసాలకు దూరంగా తరలించాలని కాలనీ సంఘాలు, స్థానికులు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు రాజధానిలో మూడు జిల్లాల పరిధిలో 615 మద్యం దుకాణాలున్నాయి. ప్రతి దుకాణానికి 100 చదరపు మీటర్లు లోపు పర్మిట్ రూము ఉండాలి. ప్యాకేజ్డ్ ఫుడ్ మాత్రమే విక్రయించాలి. పర్మిట్ రూము వెలుపల మద్యం తాగడానికి వీల్లేదు. కొన్ని దుకాణాలు ఈ నిబంధనల్ని బేఖాతరు చేస్తున్నాయి. సరైన పార్కింగ్ లేకపోవడంతో మందుబాబులు రోడ్ల మీదే వాహనాలు నిలిపేస్తున్నారు. చీకటి పడ్డాక కొందరు పర్మిట్ రూము వెలుపల మద్యం తాగుతున్నారు. ఈ సమయంలో ఆఫీసు, ఇతర పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే మహిళలు, చిన్నారలు దుకాణాల ముందు నుంచి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని ఎల్ఐజీ, ఎంఐజీ నివాసాల సమీపంలో రెండు మద్యం దుకాణాలు కొనసాగడంపై స్థానికులు ఏళ్లుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆలయం సమీపంలోనే ఉన్నాయి. దీనిపై ఇటీవల స్థానికులు ప్రజాభవన్‌లోని ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలో సత్యనారాయణ కాలనీలోని రోడ్డు నంబరు 2, 12 దగ్గర రెండు మద్యం దుకాణాలున్నాయి. ఈ కాలనీలో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నా యి. రెండు మద్యం దుకాణాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమీపంలో పాఠశాల, చిన్నారుల ఆసుపత్రి ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే దుకాణాన్ని తొలగించాలంటూ ఇటీవల కొందరు మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

## ప్రయోజనం రెండింతలు

ఖానాపురం : అసంఘటిత రంగ కార్మిక కుటుంబాలకు భద్రత, భరోసా అందించటంలో శ్రామిక (లేబర్) కార్డులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. గుర్తింపు కార్డున్న కార్మికులకు విపత్కాలంలో కార్మిక శాఖ అండగా నిలుస్తోంది. గాయపడ్డా, ప్రమాదవశాత్తు చనిపోయినా ఆర్థికంగా ఆదుకుంటుంది. 2025, జూన్ నుంచి ప్రభుత్వ సాయం కొన్నింట్లో రెండింతలు చేశారు. దీనిపై అవగాహనలేని వారు పేరు నమోదులో, రెన్యువల్‌లో శ్రద్ధ చూపటం లేదు.

**ఎవరు అర్హులు**తవ్వకం పని, రాళ్లు కొట్టేవారు, తాపీ, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, శానిటరీ, వడ్రంగి, రంగులు వేయటం, టైల్స్, మార్బుల్, ఎలక్ట్రీషియన్, రవాణా మార్గ నిర్మాణ పనులు, నీటిపారుదల నిర్మాణం, వెల్డింగ్, రిగ్గర్లు, బోర్‌వెల్, ఇంటీరియల్, ఇటుక, సున్నం బట్టీలు, క్వారీలు, కాంక్రీట్ మిక్చర్, నిర్మాణ రంగ వాహనాలపై పనిచేసేవారు. ఎలక్ట్రికల్, టెలిఫోన్ లైన్ల నిర్మాణం, విద్యుత్తు ఉత్పత్తి లేదా పంపిణీ, ల్యాండ్ స్కేపింగ్, గ్లాస్, టన్నెల్, రోలర్ డ్రైవర్, లిఫ్ట్ వర్కర్లు, వాచ్‌మెన్, మేస్త్రీల వద్ద పనిచేసే కూలీలు. భార్య లేదా ఇద్దరు కుమార్తెల మొదటి, రెండో కాన్పులకు రూ.30వేల సాయం అందుతుంది. ప్రసూతి తేదీ నుంచి ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలి. కుమార్తెల వివాహానికి రూ.30వేలు ఇస్తారు.

కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం నామినీకి రూ.30వేలు



ఇస్తారు. క్యాన్సర్, హృద్రోగం, డయాలసిస్, కాలేయ సంబంధిత వ్యాధులు, పార్కిన్సన్, ఎయిడ్స్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పొందుతున్న వారికి నెలకు రూ.4,500 చొప్పున మూడు నెలలు సాయం అందుతుంది.

**వయసు?**

18-60 ఏళ్లలోపు కార్మికులు. గడిచిన ఏడాదిలో 90 రోజులు భవన నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి.

**దరఖాస్తు ఇలా..**

మీ-సేవా కేంద్రంలో రూ.110 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే సంబంధిత సహాయ కార్మిక అధికారి పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు. తర్వాత గుర్తింపు కార్డు పొందవచ్చు. ఐదేళ్లకోసారి సభ్యత్వాన్ని తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలి.

'గ్రామాల్లో కార్మిక శాఖ ఏజెంట్లు అంటూ కొంతమంది వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు. వారిని నమ్మొద్దు. ఏ దరఖాస్తు అయినా మీ సేవా ద్వారా ఆన్‌లైన్ చేయించుకోండి. జిల్లాలో బోగస్ కార్డులు చాలా ఉన్నాయి. సమస్య ఉంటే నేరుగా మా కార్యాలయంలో సంప్రదించవచ్చు.' విజయభాస్కర్‌రెడ్డి, కార్మిక శాఖ ఉప కమిషనర్, ఖమ్మం.

## రామాలయానికి పన్ను పోటు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఆదాయాన్ని పెంచుకుంటున్నా ఏదో ఒక రూపంలో పన్ను పోటు తప్పడం లేదు. భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాల ద్వారా సమకూరే నికర ఆదాయం నుంచి సుమారు 21.5 శాతం వేర్వేరు పద్దుల రూపంలో సర్కారుకు ఏటా చెల్లించాల్సి వస్తోంది. యాత్రికుల సందడి పెరిగి ఏడాదికి రూ.100 కోట్ల ఆదాయం వచ్చిందంటే అందులో రూ.21.5 కోట్లను నాలుగు రకాల రుసుముల రూపంలో ప్రభుత్వం వసూలు చేస్తోంది. శ్రీరామ క్షేత్రం సుమారు రూ.23.34 కోట్ల బకాయి ఉందంటే మాటలు కాదు. సర్కారు కనికరించి ఇందులో కొంత మినహాయింపు ఇవ్వాలని రామ భక్తులు కోరుతున్నారు. ముక్కు పిండి వసూలు చేస్తామని పట్టుపడితే ఖజానాకు భారం తప్పదని అంచనా వేస్తున్నారు.

**పన్ను భారం తగ్గేనా...**

రామాలయానికి ఏడాదికి రూ.80 కోట్ల మేర ఆదాయం సమకూరు తోంది. ఇందులో నికరంగా రూ.30 కోట్ల వార్షిక ఆదాయం ఉంటుంది. సాధారణ ప్రయోజన నిధి(కామన్ గుడ్ ఫండ్) 5 శాతం, ఆడిట్ రుసుం 1.5 శాతం, దేవాదాయ పరిపాలన నిధి(ఎండోమెంట్ అడ్మినిస్ట్రేషన్ ఫండ్) 12 శాతం, అర్చక సంక్షేమ నిధి 3 శాతం.. ఇలా 21.5 శాతాన్ని నికర ఆదాయం నుంచి చెల్లించాలన్నది నిబంధన. ఏడాదికి రూ.5 కోట్లకు పైగా పన్నులు భరించాలి. 2016 నుంచి 2025-26 లెక్కలను పరిశీలిస్తే ఎప్పటి పన్నును అప్పుడు పూర్తిస్థాయిలో చెల్లించలేకపోతున్నారు. గల్లా పెట్టెలో కాస్త మిగులు కనిపిస్తే చాలు బాకీ చెల్లిస్తున్నారు. సాధారణ ప్రయోజన నిధి రూపంలో రూ.2 కోట్లకు పైగా చెల్లించారు. మిగతా వాటిని ఆయా ఖాతాలకు జమ చేయాలంటే అది కచ్చితంగా ఆలయ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుంది. కనీసం ఇప్పటి వరకు ఉన్న బాకీ రద్దు చేసి ఇక నుంచి క్రమం తప్పకుండా వసూలు చేసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు 2016 నుంచి 2025 వరకు గల లావాదేవీల పత్రాలను తనిఖీ చేస్తుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. పన్నుల్లో కొంత బకాయి ఉన్నప్పటికీ చెల్లింపులన్నీ పారదర్శకంగా ఉన్నాయని ఈఓ దామోదర్‌రావు తెలిపారు.

**ఆడిటింగ్‌పై దృష్టి సారించాలి**

రామాలయం ఆధ్వర్యంలో జరిగే క్రయవిక్రయాలపై జీఎస్టీ ప్రభావం



పడుతూనే ఉంది. ఈ తరహా పన్ను ఏ మేరకు ఉందన్నది తేలాలి. ఇదే క్రమంలో ఆడిటింగ్ అభ్యంతరాలు రూ.కోట్లలో పేరుకున్నాయి. ఈ అంశంపై భిన్న వాదనలు, ఫిర్యాదులు ఉన్నందున దృష్టి సారించాలి.

| పద్దు.. | రూ.(కోట్లలో) |
|---|---|
| దేవాదాయ పరిపాలన నిధి | 14.75 కోట్లు |
| అర్చక సంక్షేమ నిధి | 5.52 |
| ఆడిట్ రుసుము | 3.06 |
| సాధారణ ప్రయోజన నిధి | |

# స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానంలో సేవలందించాలి: సీఎం చంద్రబాబు



అమరావతి: స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి సీఎస్ విజయానంద్‌తో పాటు జలవనరులు, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానంలో వేగంగా పౌరులకు మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. సుస్థిరాభివృద్ధితో పాటు స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు నిర్దేశించుకోవాల్సిన అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. ప్రభుత్వ శాఖల మధ్య మెరుగైన సమన్వయం, తక్కువ వ్యయంతో ఇంధనం, విద్యుత్, రవాణా, నీటి భద్రత అందించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జీరో పావర్టీ, మానవ వనరుల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సాంకేతికత మేళవింపు తదితర అంశాల ఆధారంగా లక్ష్యాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.




# ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇక్కడ ఉన్న మూడు రోజుల్లోనే తనకు అలర్జీ వచ్చిందని వెల్లడించారు. దేశ రాజధానిలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు అలర్జీ వచ్చింది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గించలేమా..? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలి" అని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. 2025 నాటికి పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపి వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పెట్రోల్, ఇథనాల్‌ను కలిపి వినియోగించడాన్నే ఫ్లెక్స్‌ఫ్యూయల్ అని పిలుస్తారు. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారును ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. ఇది కాలుష్యాన్ని తగ్గిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. మంగళవారం అతి తీవ్రస్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం కాస్త మెరుగుపడింది.

ఇదిలాఉంటే.. గతంలోనూ ఆయన ఢిల్లీ కాలుష్యం గురించి మాట్లాడారు. "నేను రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఢిల్లీలో ఉంటాను. ఇక్కడికి వచ్చినప్పుడు ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటా. నేను ముందే రిటర్న్ టికెట్లను బుక్ చేసుకుంటా" అని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.




# వృద్ధురాలికి ఇచ్చిన మాట కోసం.. ఇప్పటంలో పవన్ పర్యటన

తాడేపల్లి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం చేరుకున్నారు. వైకాపా హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో జనసేన కార్యకర్తల ఇళ్లు కూల్చివేశారు. జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతో ఇలా చేశారనే ఆరోపణలున్నాయి. అప్పట్లో పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో గెలిచాక మళ్లీ రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన్ను కోరింది. ఈ నేపథ్యంలో ఆమెకు ఇచ్చిన మాట మేరకు ఇప్పటం చేరుకున్న పవన్.. నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లారు. ఆయనకు వృద్ధురాలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఆమెను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధురాలికి రూ.50వేలు, ఆమె మనవడి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. నాగేశ్వరమ్మ కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు.

ఆమె మనవడి చదువు కోసం ప్రతి నెలా తన వేతనం నుంచి రూ.5వేలు ఇవ్వాలని పవన్ నిర్ణయించారు. అనంతరం నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పవన్ తమ ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంటికి పెద్ద కుమారుడిలా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారని ఆమె చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారని తెలిపారు.

# గత ప్రభుత్వ అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తుంది: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి




అమరావతి, డిసెంబర్ 24: జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో అనేక అవినీతి కార్యక్రమాలు జరిగాయని.. అన్ని ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సైతం సంచలన విషయాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులనే కాకుండా.. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులను కూడా అనేక ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. అంతేకాదు.. తిరుమల వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పించే విషయంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ మండిపడ్డారు.

టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నేడు ఆయన నేడు బయటకు వచ్చి ఎటువంటి అక్రమాలు జరగలేదని చెప్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ పాలనలో అన్నప్రసాదంలో కానీ, వసతి విషయంలో కానీ అక్రమాలన్నీటిని బయటకు తీస్తున్నామని మంత్రి జనార్దన్ రెడ్డి వివరించారు. డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి అని.. ఆ రోజు 90 శాతానికి పైగా సామన్య భక్తులకు సౌకర్యాలు కల్పించాలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అలాగే, లడ్డు ప్రసాదం తయారీకి వినియోగిస్తున్న నెయ్యిని కూడా అన్ని పరీక్షలు నిర్వహించి తరువాతే లడ్డు తయారీకి ఉపయోగిస్తున్నామని వివరించారు. ఇవన్నీ చూసి ఓర్వలేక.. పత్రికల ద్వారా తిరుమలపై అసత్య ప్రచారాలు చేయిస్తున్నారంటూ వైసీపీ నాయకులపై మండిపడ్డారు.

దేవుడి మీద నమ్మకం లేని భూమన కరుణాకర్ రెడ్డికి టీటీడీ పదవిని కట్టబెట్టడమే గత ప్రభుత్వ తప్పు అని ప్రజలందరూ అనుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని.. ఇది చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ఇటీవల విశాఖపట్నం వేదికగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి కోట్లాది రూపాయల పెట్టుబడులుగా వచ్చాయన్నారు. దీంతో దేశం మొత్తం ఆంధ్రరాష్ట్ర పురోగతి చూస్తుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

# మమ్మల్ని బాధపెట్టిన ఎవర్నీ విడిచిపెట్టం: మంత్రి సంధ్యారాణి



అమరావతి: రాజకీయంగా ఎదుర్కోలేకే.. తన కుటుంబం, వ్యక్తిగత సహాయకుడి(పీఏ)పై నింద మోపారని ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా తీవ్ర ఆరోపణలు చేశారని చెప్పారు. "వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని ఛానళ్లు నా కుటుంబాన్ని అభాసుపాల్జేశాయి. నెల రోజుల పాటు నన్ను ఎంతో బాధపెట్టారు. నన్ను, నా కుమారుడిని బాధపెట్టిన ఎవర్నీ విడిచిపెట్టేది లేదు. ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని సైబర్ క్రైమ్ అధికారులను కోరా" అని సంధ్యారాణి తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) సతీశ్, ఆమె కుమారుడిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం స్పష్టం చేశారు. వాట్సప్‌లో అసభ్యకర సమాచారం పంపినట్లు ఓ మహిళ చేసిన ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి నేడు మాట్లాడారు.

# రుషికొండపై కేబినెట్ సబ్ కమిటీ మరోసారి భేటీ.. ఏం తేల్చారంటే



అమరావతి, డిసెంబర్ 24: విశాఖ రుషికొండ ప్యాలస్‌పై మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం జరిగిందని... హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ప్యాలెస్‌ను ఇచ్చే అంశంపై పరిశీలించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ (%వీఅఅఅర్వతీ్రాఖుఎఋజఋశ్రీ ఖవంష్టుజ%) తెలిపారు. కానీ కొంతమంది హెూటల్ కోసం అదనపు స్థలం కావాలని అడిగారని చెప్పారు. రుషికొండ కింద ఉన్న 9 ఎకరాలు స్థలంలో ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనలోకి వస్తాయని.. ఆ 7 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదన్నారు. తమకు ఇదో సవాల్‌గా మారిందన్నారు. ఎల్లుండి మరోసారి సమావేశం అవనున్నట్లు చెప్పారు. రుషికొండ నిర్మాణాలపై మళ్ళీ నిర్మాణాలు చేసే అవకాశం ఉందని.. పైన రెండు ఫ్లోర్లు వేసుకునే అవకాశం ఉందన్నారు. రుషికొండ చివరి రెండు బ్లాక్‌లు ప్రజలకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు, టూరిస్ట్ అవసరాల కోసం ఉంచుతామని చెప్పారు. తాజ్ గ్రూప్, లీలా హెూటల్ గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ వంటి గ్రూప్ హెూటల్స్ ముందుకు వచ్చాయని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రుషికొండపై ఇప్పుడు తలబద్దలు కొట్టుకోడానికి ఆనాటి ప్రభుత్వమే కారణమని ఏపీ టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ఆదాయం వచ్చే భవనాలు కూల్చి ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. మరోసారి రుషికొండ వినియోగంపై చర్చ జరుగుతుందన్నారు. అనేక ప్రపోజల్స్ వస్తున్నాయని.. వైబుల్ ప్రాజెక్ట్ ఏంటి అనే అంశంపై దృష్టి పెట్టామని తెలిపారు. సముద్రం ఆటు పోట్ల వల్ల రుషికొండ కింద 9 ఎకరాల్లో 2 ఎకరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయన్నారు. ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనల పరిధిలోకి ఉంటాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కాగా.. రుషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ 3వ భేటీ ఈరోజు (బుధవారం) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీ టీఏ సీఈఓ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు పాల్గొనగా... మంత్రి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్‌గా పాల్గొన్నారు.




# యూనస్ మెడకు చుట్టుకున్న హాదీ హత్య.. పారిపోవడం తప్పదంటూ హెచ్చరికలు

ఢాకా: రాజకీయ అస్థిరత నెలకొన్న బంగ్లాదేశ్‌లో నానాటికీ పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. యువనేత ఉస్మాన్ హాదీ హత్యలో ప్రభుత్వం ప్రమేయం ఉందన్న ఆరోపణలు తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌ను చిక్కుల్లో పడేస్తున్నాయి. అదే సమయంలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేయడం కూడా యూనస్ సర్కారును ఇబ్బంది పెడుతోంది.

**పారిపోవాల్సి వస్తుంది జాగ్రత్త..!...** యువ నాయకుడు, ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో ఇటీవల తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. దీనిపై హాదీ సోదరుడు తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. హాదీ హత్యలో యూనస్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల హస్తం ఉన్నట్లు ఆరోపించారు. "ఉస్మాన్ హాదీని మీరే (యూనస్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) చంపేశారు. ఈ ఘటనను ఉపయోగించుకొని వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలు రద్దు చేయాలని చూస్తున్నారు. నా సోదరుడి హత్యపై వేగంగా దర్యాప్తు జరిపి హంతకులను పట్టుకోవాలి. హాదీకి న్యాయం జరగకపోతే.. మీరు కూడా ఏదో ఒకరోజు బంగ్లాదేశ్‌ను వీడి పారిపోవాల్సిన పరిస్థితి వస్తుంది జాగ్రత్త..!" అని ఉస్మాన్ హాదీ సోదరుడు ఒమర్ హెచ్చరించాడు. విద్యార్థి ఉద్యమంతో గతేడాది షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో హాదీ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ ఉద్యమంతో హసీనా దేశం వీడాల్సి వచ్చింది. ఆ పరిణామాలను ఉద్దేశిస్తూనే హాదీ సోదరుడు పరోక్షంగా యూనస్‌ను హెచ్చరించారు.

**అమెరికా ఆందోళన..** ఇదిలాఉండగా.. మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో వచ్చే ఏడాది ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. దీనిపై అమెరికా చట్టసభ్యులు కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శక, స్వేచ్ఛాయుత విధానంలో ప్రభుత్వాన్ని ఎన్నుకొనే హక్కు బంగ్లాదేశ్ పౌరులకు ఉందని వారు పేర్కొన్నారు.

అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికలు నిర్వహించేందుకు తాత్కాలిక ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. అవామీ లీగ్‌పై నిషేధాన్ని పునఃసమీక్షించాలని వారు సూచించారు.

**ఆమెను తొలగిస్తారా, లేదా?..** మరోవైపు, బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల పలు మీడియా సంస్థలపై ఆందోళనకారులు దాడి చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరో మీడియా సంస్థకు బెదిరింపులు వచ్చాయి. గ్లోబల్ టీవీ హెడ్ నాజ్నిన్ మున్నీని తొలగించాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కొందరు బెదిరింపులకు పాల్పడ్డారు.

# సుపరిపాలన యాత్రకు విశేష స్పందన: పీవీఎన్ మాధవ్



విజయవాడ, డిసెంబర్ 24: అటల్ మోదీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వాజ్‌పేయి విగ్రహాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేటి తరానికి వాజ్‌పేయి విలువలు ఆదర్శమని అన్నారు. వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకుని అందరూ ఆశ్చర్యవ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సుపరిపాలన యాత్ర గురించి సీఎం చంద్రబాబుకు చెప్పిన వెంటనే ఆనందం వెలిబుచ్చారని తెలిపారు. ఈ యాత్రకు కూటమిపరంగా , ప్రభుత్వపరంగా సహకారం అందించారని చెప్పారు. ఈ యత్రలు, సభల్లో కూటమి పార్టీల నేతలను భాగస్వామ్యం చేశారన్నారు. అటల్, చంద్రబాబులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లకు నాడు వాజ్‌పేయి సహకారం అందించారని గుర్తుచేశారు. సుపరిపాలన యాత్రలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారన్నారు. వాజ్‌పేయి ఈ దేశానికి చేసిన సేవకు, త్యాగాలను గురించి అందరూ ముక్త కంఠంతో కీర్తిస్తున్నారని తెలిపారు. ఈనెల 25న వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో స్మృతి వనం, విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ధర్మవరం నుంచి అమరావతి వరకు తమ యాత్రకు ప్రజలు నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలకు రోడ్లు, ఐటీ, టెలికం, పొలిటికల్ కనెక్టివిటీలకు ఆద్యులు వాజ్‌పేయి అని కొనియాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా ప్రజలు నుంచి వస్తున్న స్పందన అపూర్వమన్నారు. నేటి యువతరం, భవిష్యత్తుతరాలు వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకోవాలని సూచించారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాలు, యాత్ర ద్వారా వాజ్‌పేయి నుంచి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారన్నారు. వాజ్‌పేయి ఆశయాలకు అనుగుణంగా మోదీ అద్భుతమైన పాలన సాగిస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్, వికసిత్ ఏపీ కోసం అందరం కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. సుపరిపాలన యాత్రలకు, సభలకు సహకారం అందించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 25న జరిగే వాజ్ పేయి భారీ విగ్రహం ఆవిష్కరణ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపునిచ్చారు.




గాజువాక (విశాఖ): నగరంలోని గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైపై కేసు నమోదైంది. 2023లో నలుగురు కానిస్టేబుళ్ల నుంచి అధిక వడ్డీ ఆశ చూపి రూ.15 లక్షల వరకు వసూలుచేసిన ఏఎస్సై మోతుపల్లి నర్సింహరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పార్థసారథి తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2023 జూన్‌లో ట్రాఫిక్ విభాగంలో ఏఎస్సైగా పనిచేస్తున్న నర్సింహరాజు సహచర కానిస్టేబుళ్లు సన్యాసినాయుడు, శేఖర్, త్రినాథ్, రవి, నానాజీల నుంచి రూ.15.30 లక్షలను అధిక వడ్డీ ఆశ చూపి తీసుకున్నాడు. రూ.లక్షకు రూ.10 వేలు చొప్పున రెండు నెలల పాటు వడ్డీ చెల్లించాడు.

ఆ తర్వాత నుంచి తాను షేర్‌మార్కెట్‌లో క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌లో నష్టపోయానని తప్పించుకుంటూ వచ్చాడు. రోజులు గడిచి పోతున్నా న్యాయం జరగకపోవడంతో కానిస్టేబుల్ సన్యాసినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం దీనిపై విచారణ చేస్తున్నట్లు సీఐ పార్థసారథి తెలిపారు.




# కళ్లలోనే దాగి ఉంది గ్రీకు దేవత

ఆరడుగులు పైగా ఎత్తు.. అందమైన కళ్లు.. ఫిట్ లుక్‌తో గ్రీకువీరుడిగా మగువల గుండెల్లో నిలిచి ఉన్నాడు హృతిక్ రోషన్. అమ్మాయిలు అతడిని కలల రాకుమారుడిగా భావిస్తారు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి ఒక నటి చిత్రసీమలో వెలుగులు విరజిమ్మేందుకు బరిలో దిగింది. పేరు పష్మీనా రోషన్. ఈ బ్యూటీ 'ఇష్క్ విష్క్ రీబౌండ్' అనే చిత్రంతో బాలీవుడ్ లో అడుగుపెట్టి, ఇప్పుడు దక్షిణాది చిత్రసీమపైనా మనసు పారేసుకుందని సమాచారం. అందమైన కళు టీనేజీ వైబ్స్ తో ఈ బ్యూటీ ఇప్పటికే కుర్రకారు మనసులపై పష్మీనా రోషన్ బలమైన ముద్ర వేసింది. ఇటీవల కొన్ని నెలలుగా డ్రీమ్ బోయ్ కార్తీక్ ఆర్యన్ తో డేటింగ్ చేస్తోందంటూ పుకార్లు షికార్ చేసాయి. హృతిక్ రోషన్ కజిన్ పష్మీనా రోషన్ తో కార్తీక్ బాగా చనువుగా ఉంటున్నాడని పుకార్లు వస్తున్నాయి. అయితే ఆ తర్వాత జాతీయ మీడియా కథనంలో ఈ జంట బ్రేకప్ అయిపోయిందని కూడా కథనాలు వచ్చాయి. పాపులర్ పోర్టల్ ప్రకారం.. కార్తీక్- పష్మీనా గత 5-6 నెలలుగా కలిసి చాలా సమయం గడిపారు. కొంతకాలం డేటింగ్



కూడా చేశారు. అయితే ఇద్దరి మధ్యా సింక్ కుదరలేదు. అందువల్ల విడిపోయారు.. అంటూ ఈటైమ్స్ పేర్కొంది. పష్మీనా రోషన్ తాజా ఫోటోషూట్ గుబులు రేపుతోంది. ఈ అందమైన సోగకళ్ల సుందరి బ్లాక్ ఔట్ ఫిట్ లో అగ్గి రాజేస్తోంది. పష్మీనా బ్లాక్ ఫ్రాక్ లో స్ట్రైకింగ్ ఫోజులతో కట్టి పడేసింది. ఒక అద్దంలో తన యవ్వనాన్ని తనివితీరా చూసుకుంటున్న పష్మీనా, కుర్రకారు మనసులపై ఘాడమైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ వైరల్ గా దూసుకెళుతోంది. గ్రీక్ గాడెస్! అంటూ ఈ భామకు కితాబిచ్చేస్తున్నారు.

**పష్మీనా ఎవరు?....** పష్మీనా రోషన్ భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని దిగ్గజ సినీ కుటుంబం నుండి వచ్చారు. ఒక రకంగా నేపో కిడ్ అని పిలవాలి. ప్రఖ్యాత సంగీత దర్శకుడు రాజేష్ రోషన్ -కాంచన్ రోషన్ ల కుమార్తె. 1970ల నుండి బాలీవుడ్ లో సంగీత దిగ్గజంగా పాపులరైన రాజేష్ రోషన్, ప్రముఖ సంగీత స్వరకర్త రోషన్ లాల్ నాగ్రత్ కుమారుడు. సినిమా సంగీతం, కళా రంగంతో సంబంధం ఉన్న రోషన్ కుటుంబంలో పష్మీనా రోషన్ మూడవ తరం అమ్మాయి. ప్రముఖ బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ తనకు కజిన్. హృతిక్ ప్రముఖ దర్శకనిర్మాత రాకేష్ రోషన్ కుమారుడు అన్న సంగతి తెలిసిందే. ఈ కుటుంబం నుంచి మరికొందరు సినీరంగంలో రాణిస్తున్నారు.

# అదితీరావ్ పేరుతో మోసగాడి వాట్సాప్ వల

తనదైన అందం ఛమత్కారమైన నటనతో యువతరం హృదయాలను గెలుచుకున్న అదితీరావ్ హైదరీ తాను వలచిన సిద్ధార్థ్ ని పెళ్లాడి సంసార ఆస్వాధనలో ఉన్న సంగతి తెలిసినదే. అదితీ ఇంతకముందు హీరామండిలో అద్భుత నటనతో కట్టి పడేసింది. వేశ్య పాత్రలో గజగామిని నడకలతో యూత్ గుండెల్ని కోతకు గురి చేసిన ఈ బ్యూటీని ఒక మోసగాడు స్వార్థ పూరిత ప్రయోజనాల కోసం మిస్ యూజ్ చేస్తున్నాడని ఆరోపించింది. అతడు నాలాగా నటిస్తున్నాడు. నమ్మకండి..అది నా వాట్సాప్ కాదు! అని అదితీ ఆందోళన వ్యక్తం చేసారు. నాలాగా నటిస్తున్న వాట్సాప్ ఫేక్ బోయ్ ఎవరో తెలీదని అన్నారు. అతడి వివరాలతో పాటు ఒక నోట్‌ను షేర్ చేసింది. "కొందరు నా దృష్టికి తెచ్చారు.. ఎవరో వాట్సాప్‌లో నాలాగా నటిస్తూ, నా ఫోటోలను ఉపయోగించి 'ఫోటోషూట్'ల గురించి ఫోటోగ్రాఫర్‌లకు మెసేజ్‌లు పంపుతున్నాడు. అది నేను కాదు. నేను



ఇలా సంప్రదించను. పని కోసం ఏ వ్యక్తిగత నంబర్‌ను ఉపయోగించను. ప్రతిదీ నా టీమ్ చూసుకుంటుంది" అని అన్నారు. దయచేసి జాగ్రత్తగా ఉండాలని, ఆ నంబర్ ని నమ్మకండి! అని కూడా హెచ్చరించారు. మీకు ఏదైనా వింతగా అనిపిస్తే, నా టీమ్‌కి వెంటనే తెలియజేయండి. నాకు మద్దతుగా రక్షణాత్మకంగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు! అని నోట్ లో రాసారు. అయితే ఈ పోస్ట్‌పై స్పందించిన సహచర నటి కుషా కపిల "అయినా మీ గజగామిని నడకను కాపీ చేయలేరు" అని రాసారు. మీ ఇన్‌స్టాగ్రామ్ డిపిని ఉపయోగించి వారు ఏమీ చేయలేరు! అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి నవ్వుతున్న ఎమోజీని కూడా నటి కుషా కపిల జోడించారు. అదితీరావ్ హైదరీ హైదరాబాదీ అమ్మాయి. అందువల్ల ఈ నవాబుల అమ్మాయిని పెళ్లాడిన సిద్ధార్థ్ కూడా హైదరాబాద్ అల్లుడయ్యాడు. ప్రస్తుతం ఈ జంట అన్యోన్య దాంపత్యం, రొమాంటిక్ లైఫ్ అన్నివేళలా చర్చనీయాంశమైంది. అదితీ రావ్ తల్లిదండ్రులు హైదరాబాద్, ఢిల్లీతో అనుబంధం కలిగి ఉన్నారు. అదితీ తెలుగు, తమిళం, హిందీలో ప్రముఖ కథానాయికగా వెలిగిపోతోంది. లైనెస్, పరివారిక్ మనురాంజన్ అనే రెండు చిత్రాలతో అతిదీ బిజీగా ఉంది.

# శంకర వరప్రసాద్ గారు సెకండ్ సాంగ్.. నిరాశలో డార్లింగ్ ఫ్యాన్స్





టాలీవుడ్ మెగాస్టార్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా మన శంకరవరప్రసాద్ గారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి అపజయమే ఎరుగని అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గత కొన్ని సినిమాలుగా వరుస ఫ్లాపుల్లో ఉన్న చిరంజీవి, అనిల్ తో సినిమాను అనౌన్స్ చేసినప్పుడే ఈ సినిమా మంచి హిట్ అవడంతో పాటూ మెగాస్టార్ ను తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందని అందరూ భావించారు.

**గెస్ట్ రోల్ లో విక్టరీ వెంకటేష్...** చిరంజీవి- అనిల్ కాంబినేషన్ లో వస్తున్న మొదటి సినిమా కావడంతో పాటూ అనిల్ రైటింగ్ కు చిరూ కామెడీ టైమింగ్ తోడైతే ఎలా ఉంటుందో చూడ్డానికి మెగా ఫ్యాన్స్ తో పాటూ సినీ లవర్స్ కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. నయనతార హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ఓ గెస్ట్ రోల్ చేసి ఆడియన్స్ ను అలరించనున్నారు.

**మీసాల పిల్ల సాంగ్ కు విపరీతమైన రెస్పాన్స్...** మొదటి నుంచి ఈ మూవీపై ఆడియన్స్ కు మంచి అంచనాలుండగా, ఈ సినిమా నుంచి ఇప్పటివరకు బయటికొచ్చిన ప్రతీ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. టైటిల్ గ్లింప్స్ నుంచి రీసెంట్ గా వచ్చిన ఫస్ట్ సింగిల్ వరకు ప్రతీదీ బ్లాక్‌బస్టరే. ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ ఆల్రెడీ 60 మిలియన్ల వ్యూస్ ను దాటేసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా ఇప్పుడు సినిమాలోని సెకండ్ సింగిల్ పై అప్డేట్ వినిపిస్తోంది. మన శంకరవరప్రసాద్ గారు సినిమా నుంచి సెకండ్ లిరికల్ నవంబర్ నెలాఖరున రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ సెకండ్ సాంగ్ డ్యూయెట్ సాంగ్ గా రానుందని, ఫస్ట్ సాంగ్ లానే ఈ సాంగ్ లో కూడా చిరూ మంచి గ్రేస్ తో స్టెప్పులేయనున్నారని సమాచారం. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న మన శంకరవరప్రసాద్ గారు సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. కాగా 2026 సంక్రాంతికి పలు సినిమాలు రిలీజ్ కానుండగా అందులో ఎంతో ముందుగా ప్రమోషన్స్ ను మొదలుపెట్టింది ఈ సినిమానే. మిగిలిన సినిమాలు, మరీ ముఖ్యంగా రాజా సాబ్ నుంచి ఇప్పటివరకు కనీసం ఫస్ట్ సింగిల్ కూడా రాకపోవంతో ప్రభాస్ ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, ప్రమోషన్స్ విషయంలో మెగా ఫ్యాన్స్ మాత్రం ఫుల్ హ్యాపీగా ఉన్నారు. అనిల్ రావిపూడి సినిమా అంటే ప్రమోషన్స్ ఏ స్థాయిలో ఉంటాయో కొత్తగా చెప్పే పన్లేదు. అందులో భాగంగానే చిరూ సినిమాను కూడా అనిల్ చాలా డిఫరెంట్ గా ప్రమోట్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారట. కానీ రిలీజ్ దగ్గరపడుతున్నప్పటికీ రాజా సాబ్ నుంచి ఇంకా కనీసం ఫస్ట్ సాంగ్ ను కూడా రిలీజ్ చేయకపోవడంతో డార్లింగ్ ఫ్యాన్స్ నిరాశ పడుతున్నారు.

# అక్కడ రామాయణ.. ఇక్కడ వారణాసి.. ఏం జరుగుతుందో?





ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు మైథలాజికల్ జోనర్ లో సినిమాలు రూపొందుతుంటాయి. ఇప్పటికే వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇప్పుడు మరిన్ని చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఆయా మూవీల షూటింగ్స్ శరవేగంగా జరుగుతుండగా.. వచ్చే ఏడాది థియేటర్స్ లోకి వచ్చి సందడి చేయనున్నాయి. ఆ సినిమాల్లో రెండు రామాయణ, వారణాసి. ఇతిహాసం రామాయణం ఆధారంగా ప్రతిష్టాత్మకంగా రామాయణ మూవీ నార్త్ లో రూపొందుతోంది.

రెండు భాగాల్లో రిలీజ్ కానుంది. అదే సమయంలో సౌత్ లో వారణాసి సినిమా తెరకెక్కుతోంది. ఆ మూవీలో మైథాలజీతోపాటు టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్స్ టచెస్ కూడా ఉన్నాయని వినికిడి. ఏదేమైనా రామాయణ, వారణాసి.. రెండు భారీ బడ్జెట్ తో రూపొందుతున్న చిత్రాలే.. పాన్ ఇండియా సినిమాలే.. ఇప్పుడు రెండూ షూటింగ్స్ ను జరుపుకుంటున్నాయి. అయితే రెండింటిపై కూడా ఆడియన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా రిలీజ్ అయిన గ్లింప్సెస్ తో సినీ ప్రియులు, అభిమానులు హోప్స్ పెట్టుకున్నారు. అదే సమయంలో ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. రెండు సినిమాలు రిలీజ్ అయ్యాక కంపేరిజన్లు ఉంటాయని అనేక మంది నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే రామాయణంలోని కొంత అంశాన్ని మన రాజమౌళి వారణాసి మూవీకి గాను తీసుకున్నట్లు ఇప్పటికే గ్లింప్స్ అండ్ రాజమౌళి కామెంట్స్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. దీంతో పోలికలు వస్తాయని, ఇది మేకర్స్ కు సవాల్ లాంటిదని అభిప్రాయపడుతున్నారు. అయితే రామాయణ, వారణాసి డైరెక్టర్లు నితీష్ తివారీ, రాజమౌళి.. ఇద్దరూ మంచి టాలెంట్ ఉన్న దర్శకులే. రామాయణ మూవీతో విజువల్ వండర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఆడియన్స్ కు మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజమౌళి గురించి అందరికీ తెలిసిందే. ఒక్క పద్ధతి.. ఒక ప్లానింగ్.. ఒక విజన్ అనే స్టేట్మెంట్ కరెక్ట్ గా సెట్ అవుతుంది. ఇప్పటికే బాహుబలి సిరీస్ చిత్రాలతోపాటు ఆర్ ఆర్ ఆర్ తో వరల్డ్ వైడ్ గా ఉన్న సినీ ప్రియులను అలరించారు. ఇప్పుడు వారణాసి మూవీతో రాజమౌళి ప్రేక్షకులను నిరాశపరచడనే నమ్మకం అందరికీ ఉంది.

కాబట్టి అటు రామాయణ.. ఇటు వారణాసి సినిమాలు రిలీజ్ అయ్యాక ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# నటికి గంటల తరబడి తిండి తినే అరుదైన వ్యాధి

దంగల్ చిత్రంలో క్రీడాకారిణిగా నటించింది ఫాతిమా సనా షేక్. ఆ సినిమా పాన్ ఇండియాలో సంచలన విజయం సాధించడమే గాక, చైనాలో ఇప్పటికీ అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా రికార్డులకెక్కింది. ఈ సినిమాలో అమీర్ ఖాన్, సాన్య మల్హోత్రా తదితరులు నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫాతిమ దంగల్ చిత్రీకరణ సమయంలో తాను ఎదుర్కొన్న బులిమియా అనే వ్యాధి గురించి మాట్లాడింది. తనకు అతిగా తినే అలవాటుందని, ఒక్కోసారి ఆహారం విషంగా మారిపోతుందని వెల్లడించి షాకిచ్చింది. అయితే దంగల్ చిత్రీకరణ సమయంలో రోజూ 3 గంటల పాటు శ్రమించేదానిని.. కనీసం గంటన్నర సమయం జిమ్ కి కేటాయించేదానిని అని ఫాతిమా చెప్పింది. నేను నిరంతరాయంగా గంటల తరబడి తినగలను. సినిమా కోసం 3000 కేలరీలు పెరగాలి కాబట్టి బాగా తిన్నాను. కానీ దంగల్ చిత్రీకరణ అయిపోయాక కూడా అదే విధంగా తినడం కొనసాగించాను. ఒకానొక దశలో తిండిపై విసుగొచ్చింది. భయం వేసిందని తెలిపింది. అంతేకాదు దంగల్ సెట్స్ లో తనకు అతిగా తినే అలవాటుందని సహనటి సాన్య మల్హోత్రా గుర్తించినట్టు అంగీకరించింది ఫాతిమా. తనకు సిగ్గుగా అనిపించిందని కూడా చెప్పింది. కానీ తిండి మానలేని పరిస్థితి. నిరంతరం ఎక్కువగా తినడం వల్ల శరీరం నియంత్రణలో లేదని భావించినట్టు ఫాతిమా చెప్పింది. గంటల తరబడి అతిగా తినడం, ఆకలితో ఉండటం అనే



సమస్యలను తాను ఎదుర్కొన్నానని తెలిపింది. రెండు విపరీత పరిస్థితితుల మధ్య జీవించానని అంది. బాగా తిన్న తర్వాత ఆకలితో అలమటించినట్టు అనిపిస్తుంది. ఒక సంవత్సరం పాటు బులిమియాతో పోరాడాను అని వెల్లడించింది. రియా చక్రవర్తితో చాటింగ్ సెషన్ లో ఫాతిమా ఈ విషయాలను వెల్లడించింది. ఆకలి మోడ్ ఆన్ అయితే ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా గంటల తరబడి తింటానని చెప్పింది.నాకు పూర్తిగా నియంత్రణ లేకపోవడంతో నేను ఒక సంవత్సరం పాటు బులిమిక్‌గా ఉన్నాను.. ప్రతి గంటా ఆకలి ఆకలి అంటూ అలమటిస్తాను. బాగా తినేస్తాను. అప్పటికి తిండి గురించి నాకు అంతగా అవగాహన లేదు. కానీ ఇప్పుడు తనకు మంచి అవగాహన ఉందని, పరిస్థితులు మారిపోయాయని తెలిపింది. తినగా తినగా ఒక టైమ్ కి మొద్దుభారిపోయినట్టు అనిపిస్తుంది. అప్పుడు తిండిని అనుభూతి చెందలేము. తిమ్మిరితనం అనిపిస్తుంది. చివరికి వికారం అనిపిస్తుంది. ఇకపై తినకూడదని అనుకుంటాం. అయితే ఎప్పటిలాగే అధికమొత్తంలో కేలరీలు తీసుకోకపోతే అది బులిమియాకు దారి తీస్తుందని కూడా చెప్పింది. ఈ బులిమియా అత్యంత హానికరం అని వెల్లడించింది. ఫాతిమ- విజయ్ వర్మ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ గుస్తాక్ ఇష్క్ త్వరలో విడుదలకు రానుంది. ఈ చిత్రంలో నసీరుద్దీన్ షా ఓ కీలక పాత్రను పోషించారు. ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించారు.

# ఆ బ్యూటీకి విజయ్ సేతుపతి స్ఫూర్తి!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి అనతి కాలంలోనే స్టార్ లీగ్ లో చేరాడంటే? అది ట్యాలెంట్ తో మాత్రమే సాధ్యమైంది. తన అసాధారణ నటనతోనే విమర్శకుల ప్రశంసలందుకున్నాడు. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. తమిళ నటుడైనా? దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాడంటే? కేవలం తన నటనతోనే సాధ్యమైంది. భవిష్యత్ లో కమల్ హాసన్ లా పరిశ్రమలో ఎదుగుతాడని అంచనాలు భారీగా ఉన్నాయి. ఎంతో మంది స్టార్ హీరోలున్నా? వాళ్లందరికంటే తాను ప్రత్యేకమనే విషయాన్ని తన పాత్రల ద్వారా చెప్పకనే చెబుతున్నాడు.

**రెగ్యులర్ పాత్రలకు భిన్నంగా:** అయితే విజయ్ సేతుపతిని పొలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తుందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తానే స్వయంగా రివీల్ చేసింది. విజయ్ సేతుపతితో పాటు మరో ఇద్దరు యంగ్ హీరోలు కూడా తనకు స్ఫూర్తిగా నిలిచారంది. విజయ్ సేతు పతిలాగే శ్రీవిష్ణు, సుహాస్ కూడా డిఫరెంట్ ప్రయత్నాలు చేస్తున్నారంది. హీరోయిన్లు కూడా అలా ఎందుకు చేయకూడదని తాను కూడా సవాల్ గా తీసుకు న్నట్లు తెలిపింది. విభిన్న రకాల పాత్రలు పోషించే ప్రయత్నం చేస్తున్నానంది. కెరీర్ ఆరంభం నుంచి తన ఆలోచనలు రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉంటాయంది.



**పొలిమేరతో అమ్మడు ఫేమస్:** పొలిమేర, విరూపాక్ష చిత్రాలు తనకు మంచి పేరు తీసుకురావడానికి కారణంగా అందులో పాత్రలు సహా కథ కారణంగానే సాధ్యమైందని తెలిపింది. ప్రస్తుతం తాను నటిస్తోన్న 12 ఏ రైల్వే కాలనీ లో పాత్ర కూడా రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుందని పేర్కొంది. ఇదో మంచి ప్రేమ కథతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమని తెలిపింది. ప్రస్తుతం ఈ సినిమాతో పాటు, అమ్మడు మరో రెండు సినిమాల్లో కూడా నటిస్తోంది. హిట్ ఫ్రాంచైజీ పొలిమేర నుంచి పొలిమేర 3 కూడా రెడీ అవుతోంది. ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు.

**మూడు సినిమాలతో బిజీ:** రెండు భాగాలు భారీ విజయం సాధించడంతో మూడవ భాగాన్ని ఏకంగా పాన్ ఇండియాలోనే ప్లాన్ చేస్తున్నారు. భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే మాన్షన్ మౌస్ మల్లేష్ అనే మరో సినిమాలు కూడా కామాక్షి నటిస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఈ బ్యూటీ కూడా డాక్టర్ కాబోయి యాక్టర్ అయింది. కానీ డాక్టర్ గా చదువు పూర్తి చేసింది. కొంత కాలం ఉద్యోగం కూడా చేసింది. ఆ తరువాతనే మోడలింగ్ పట్ల ఆసక్తి అటువైపు టర్న్ తీసుకుంది. అక్కడా గుర్తింపు రావడంతో సినిమాల్లోనూ ప్రయత్నాలు చేసి సక్సస్ అయింది.



# గ్రామ ప్రతిమ పౌరులను సన్మానించిన సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్ నగర్ /కోస్గి: ఇటీవల నూతనంగా ఎంపికైన కొడంగల్ నియోజకవర్గంలోని గ్రామ సర్పంచులను సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఘనంగా నారాయణపేట జిల్లా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కోస్గి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సన్మానించారు. మండలాల వారిగా సర్పంచులను వేదిక పైకి ఆహ్వానించి సీఎం రేవంత్ రెడ్డి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. అంతకుముందు కోస్గి మండలం సబ్జా ఖాన్ పేట సర్పంచ్ మౌనిక, కొడంగల్ మండల పరిధిలోని చిన్న నందిగామ కు చెందిన దత్తాత్రేయరావు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తమకు సర్పంచ్ గా అవకాశం ఇచ్చారు. మా గ్రామాలను ఆదర్శవంతంగా రూపొందించుకుంటాం అని ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సన్మానించడం పట్ల సర్పంచులు, ఉప సర్పంచులు, వారి కుటుంబాలకు ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం: డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం: రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఇకపై నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. "మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం ఎదిగేందుకు 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. మానవ సంపద సృష్టించడం కీలకం. తద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున సంపద సమకూరుతుంది. విలువైన మానవ వనరులను సృష్టించేందుకు విద్యారంగంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం, న్యూట్రిషన్ ఫుడ్ ద్వారా వారికి మంచి ఆరోగ్యం అందించి విలువైన మానవ వనరులు సృష్టించాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లా కలెక్టర్ మొదలు అధికారులు అందరూ విద్యాసంస్థలను పర్యవేక్షించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ కార్యక్రమం పక్కాగా జరిగితే అద్భుతమైన ఫలితాలు సాధిస్తాం. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఏదైనా ఘటన జరిగితే అందుకు ఇన్‌ఛార్జి అధికారిని బాధ్యునిగా చేస్తాం. గోదాముల్లో వస్తువులను కుక్కినట్టుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను నమోదు చేసుకుంటున్నారు. ఇక నుంచి ప్రైవేటు విద్యాసంస్థలకు ఉండాల్సిన అర్హతలు, సౌకర్యాలపై ఒక చెక్ లిస్ట్ పెట్టుకొని అవన్నీ ఉంటేనే అధికారులు అనుమతులు ఇవ్వాలి. సౌకర్యాలు లేని విద్యాసంస్థలను అప్‌గ్రేడ్ చేసుకోవాలని వెంటనే తెలియజేయండి" అని డిప్యూటీ సీఎం అన్నారు.




హైదరాబాద్: తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు, ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. "నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది. జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మొత్తం 300 డివిజన్లు గెలుస్తాయి. గ్రేటర్ హైదరాబాద్ అంతటా ప్రచారం చేస్తా.. కాంగ్రెస్ పథకాలను వివరిస్తా" అని దానం నాగేందర్ తెలిపారు.

# మేడారంలో నూతన గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజు

తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో నూతన గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతో పాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.






# భారీగా పెరిగిన బంగారం ధర.. 10 గ్రాముల ధర రూ.1.41లక్షలు పైనే

హైదరాబాద్: దేశీయ మార్కెట్‌లో రోజురోజుకు బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటుతూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. హైదరాబాద్‌లో బుధవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,150కు చేరుకుంది. అటు వెండి కూడా పరుగులు పెడుతోంది. కేజీ ధర ఏకంగా రూ.2,25,393 పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఔన్సు బంగారం ధర 4,495 డాలర్లు, వెండి ధర 72.22 డాలర్లకు చేరింది. నేటి ట్రేడింగ్‌లో ఒక దశలో బంగారం ధర ఏకంగా 4500 డాలర్లను దాటడం గమనార్హం. ఈ ఉదయం స్పాట్ మార్కెట్‌లో ఔన్సు పసిడి ధర 4,507.27 డాలర్లకు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటికే పుత్తడి ధర దాదాపు 70శాతం వరకు ఎగబాకింది. వచ్చే ఏడాది మరోసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత పెడుతుందన్న అంచనాలతో బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడి సాధనాలుగా మదుపర్లు భావిస్తున్నారు. దీంతో ఈ లోహాల ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి.





# లక్షల్లో శిశువుల విక్రయం.. 12 మంది అరెస్ట్

హైదరాబాద్, డిసెంబర్ 24: సరోగసి పేరుతో దంపతుల నుంచి లక్షల్లో వసూలు చేసి, పిల్లలను అక్రమంగా విక్రయించిన సృష్టి కేసు రాష్ట్రంలో ఎంతటి సంచలనాన్ని సృష్టించిందో అందరికీ తెలిసిందే. తాజాగా భాగ్యనగరంలో మరో సృష్టి కేసు వెలుగులోకి వచ్చింది. పసి పిల్లలను అమ్ముతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. పిల్లల విక్రయానికి లక్షల్లో లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 12 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారి బారి నుంచి పిల్లలను రక్షించారు. వివరాల్లోకి వెళితే.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పిల్లలను తెచ్చి అమ్ముతున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లో దాదాపు 15 మంది పిల్లలను అమ్మిన ముఠాను సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. పక్కా ప్రణాళికతో శిశువులను విక్రయిస్తున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వీరంతా నగరంలోని ఎనిమిది ఆస్పత్రులకు ఏజెంట్లుగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా నుంచి ఇద్దరు బాలలను ఎస్వోటీ పోలీసులు కాపాడారు. అంతే కాకుండా ఒక్కొక్క శిశువు అమ్మకం వెనకాల 15 లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

# తిప్పలు పెడితే రాసుకోండి.. మిత్తీతో సహా తీర్చేద్దాం: హరీష్ రావు



మెదక్, డిసెంబర్ 24: సర్పంచ్ ఎన్నికలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తూ... బతుకమ్మ చీరలు ఇచ్చిన వారు ఆ చీరలు కట్టుకొని వచ్చి ఓట్లు వేయాలని కోరినట్లు మాజీ మంత్రి హరీష్ అన్నారు. బుధవారం నాడు.. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన సర్పంచులను హరీష్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండాయిజం చేసి పైసలు, సారా పంచి పోలీసులను పెట్టి కాంగ్రెస్ పార్టీ సర్పంచులను గెలిపించుకున్నారని ఆరోపించారు. ఈ ఎన్నిల్లో 4 వేలు మంది బీఆర్‌ఎస్ సర్పంచులు గెలుపొందారని తెలిపారు. బిడ్డా రేవంత్ రెడ్డి.. బీఆర్‌ఎస్ పార్టీ ఒక ఉద్యమ పార్టీ అని.. ఆ పార్టీ గుండెలో నుంచి 4 వేల మంది సర్పంచులు మొలకెత్తారన్నారు. ఇప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసి ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని వ్యాఖ్యలు చేశారు. రెండు సంవత్సరాలైతే చాలు కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్.. చెత్తను తీసేందుకు ట్రాక్టర్ పెట్టారని.. వీధి వీధినా లైట్లు పెట్టారని తెలిపారు. రెండు సంవత్సరాల తర్వాత గులాబీ జెండా ఎగురుతుందన్నారు. ఎవరన్నా తిప్పలు పెడితే రాసి పెట్టుకోండి మన గవర్నమెంట్ వచ్చాక మిత్తితో తీర్చేద్దామంటూ కొత్త సర్పంచులతో మాజీ మంత్రి అన్నారు. రైతుబంధు సగం సగం ఇచ్చారని.. బోనస్ బోనాల మిచ్చిందు యాసంగి ఎగ్గొట్టిందు అంటూ కామెంట్స్ చేశారు. బతుకమ్మ చీరలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సగం మందికి ఇచ్చి సగం మందికి ఎగొట్టారని అన్నారు. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం పిల్లలకు స్కాలర్షిప్స్ ఇచ్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడితే ప్రజలకు ఏం వస్తుందని.. తెలంగాణ ప్రజలు త్వరలో రేవంత్‌ను ఫుట్‌బాల్ ఆడుతారంటూ వ్యాఖ్యలు చేశారు. ఫుట్బాల్ మీదున్న ప్రేమ రైతుల మీద లేదన్నారు. యూరియా కావాలంటే యాప్‌లు పెట్టారని..యాప్ ఎందుకు పంట పండించడానికా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు త్వరలో గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన కామెంట్స్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు.

# డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దుకు నిరాకరించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 24: రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. రెండు వారాల్లోగా డీజీపీల ప్యానెల్ లిస్టును యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా డీజీపీ ఎంపిక ఉండాలని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ప్యానెల్ లిస్టును యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాన్ని హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ టి. మధన్ గోపాల్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం జారీ చేసిన డీజీపీ నియామక ఉత్తర్వులు 2018 నాటి సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్ లైన్స్‌కు పూర్తి వ్యతిరేకమంటూ పిటిషనర్ వ్యక్తిగతం హాజరై ఈ కేసును హైకోర్టులో వాదించారు. డీజీపీ పదవి విరమణకు కనీసం 3 నెలల ముందుగానే యూపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ భర్తీ వివరాలను సమర్పించాల్సి ఉందన్నారు. అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దాంతో శాశ్వత నియామక ప్రక్రియ ఆగిందని వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌పై హైకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

# నా స్పీచ్‌లో తప్పులు దొర్లాయి.. క్షమించండి: నటుడు శివాజీ

హైదరాబాద్, డిసెంబర్ 24: 'దండోరా' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ల వస్త్రధారణ విషయంలో నటుడు శివాజీ  చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే దిగిన వచ్చిన నటుడు శివాజీ తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పారు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తన స్పీచ్‌లో దొర్లిన అసభ్య పదాలకు సారీ చెబుతున్నానని అన్నారు. ఆరోజు స్టేజ్ మీద తనతో పాటు ఉన్న ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పారు. తన 30 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కూడా విమర్శించాను కానీ.. ఇలా ఎప్పుడు అనలేదని చెప్పుకొచ్చారు. తాను ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు మాత్రం కట్టుబడే ఉన్నానని.. అయితే ఆ రెండు పదాలు మాత్రం తప్పు అని నటుడు శివాజీ తెలిపారు.

**సారీ చెప్పడం నా బాధ్యత..** శివాజీ ఇంకా మాట్లాడుతూ... 'స్త్రీల గురించి చాగంటి, గరికపాటి సీనియర్స్, జర్నలిస్టులు, పెద్దలు గతంలో చాలా సార్లు చెప్పారు. నేని నిధి అగర్వాల్‌పై జరిగిన సంఘటన చూసి, సమంతకు జరిగినది చూసి మాట్లాడాను. నేను ఎవ్వరిని ఈ డ్రెస్‌లు వేసుకోండని చెప్పలేదు. సమాజం సినిమాల వల్ల చెడిపోతుందనే వారికి.. అవకాశం ఇవ్వకూడదనేదె నా ఆలోచన. అయినా నోటి నుంచి రెండు రాంగ్ వర్డ్స్ వచ్చాయి. అది నాకు అర్థమయి. వెంటనే నా భార్యకు, కొడుకుకు సారీ చెప్తూ మెసెజ్‌లు పెట్టాను. వీడియో కూడా రికార్డు చేశాను. నా కామెంట్స్‌ను చిన్మయి, అనసూయకు సోషల్ మీడియాలో ట్యాగ్ చేశారు. నా ఇంటెన్షన్ బ్యాడ్ కాదు.. ఇప్పటికీ నా నోటి నుంచి ఎలా వచ్చాయనేది అర్థం కావట్లేదు. నేను చేసింది తప్పు అపాలజీ కావాలని చెప్పొచ్చు. సుప్రియ ఫోన్ చెస్తే .. సారీ చెప్పాను. మిగతా వారు ఏపీ, తెలంగాణ ప్రభుత్వం మహిళా కమీషన్ ఇలా ట్యాగ్‌లు చేస్తూ పోయారు. నేను ఎవరితో అయినా మిస్ బిహేవ్ చేశానా.. చేయను కూడా. సారీ చెప్పటం నా బాధ్యత. ఇంతకన్నా పెద్ద ఇష్యూ వచ్చే వరకు నా ఇష్యూ ఇలా వెళుతూనే ఉంటుంది. ఒకవేళ నిధి అగర్వాల్ డ్రెస్ ఆ రోజు జారితే .. ఎంత దారణం. అందుకే జాగ్రత్తగా ఉండమని చెప్పాలనుకున్నాను. అయినా నాకంటే పెద్ద పదాలు ఎవరు వాడలేదా పరిశ్రమలో.. నేను మాత్రం మహిళా కమీషన్‌కు వెళ్లాలా?' అని ప్రశ్నించారు.



Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com